
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



Reg.No : AMC/NTR/DCO/2024/03
BHAVANI
BHAVANI MUTUALLY AIDED COOPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే గుర్తింపబడిన సంస్థ)
మీ పొదుపుకు... మీ రాబడి... బంగారు భవిష్యత్తు కోసం
చిన్న డిపాజిట్ ... పెద్ద రాబడి ...
Plot No. 71, Road No.3, P&T New Colony No.2, VIJAYAWADA - 520 008. Ph : 0866 2489456, M : 898 575 3456.



| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 328 | ది. 14-3-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 328 | Date : 14-3-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


## మొత్తం 5 దశల్లో మూసీ పునరుజ్జీవం

- అభివృద్ధి ఆవశ్యకతపై నేడు స్వయంగా సీఎం ప్రజెంటేషన్
- మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై స్పష్టత ఇచ్చేందుకు సిద్ధమైన సర్కార్
- స్వయంగా ప్రణాళికపై సీఎం ప్రజెంటేషన్
- మూసీ పునరుజ్జీవనం ఆవశ్యకత, కార్యాచరణను వివరించనున్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి 13 (వార్తాప్రభ) :** మూసీలో మురుగునీళ్లు కాదు మంచి నీళ్లు ప్రవహించాలన్న సీఎం రేవంత్ రెడ్డి సంకల్పానికి ఒక్కో అడుగు పడుతోంది. ప్రతిపక్షాల విమర్శలు, పరివాహక ప్రాంత ప్రజల ఆందోళనల నడుమ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ పునరుజ్జీవనం ఆవశ్యకత, కార్యాచరణ ప్రణాళికను వెల్లడించనున్నారు. హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ కృష్ణ వేదికగా సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

**బాధితులకు ముఖ్యమంత్రి హామీ :** ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు మేధావులు, దేశంలో గుర్తింపు పొందిన వ్యాపార, వాణిజ్య సంస్థలు, మీడియా ప్రతినిధులు, విదేశీ దౌత్యవేత్తలకు ఆహ్వానాలు పంపింది. వారందరి సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి మూసీ ప్రాజెక్టుపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, ప్రతిపక్షాల విమర్శలు, ఆరోపణలకు సమాధానంతో పాటు ప్రభుత్వ ఆలోచనలు, హైదరాబాద్ భవిష్యత్తు ప్రణాళికలను ఆవిష్కరించనున్నారు. మూసీ అభివృద్ధి కోసం భూసేకరణ విషయంలో ఇటీవల ప్రభుత్వ నిర్ణయాన్ని స్పష్టంగా వివరించిన ముఖ్యమంత్రి, బాధితులు నష్టపోకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

**రూ.5,812 కోట్లతో గాంధీ సరోవర్ అభివృద్ధి..** వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టి నల్గొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలిసే మూసీ నది నగరంలో 55 కిలోమీటర్లు ప్రవహిస్తోంది. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద ఈసీ వాగుతో కలిసి ముందుకు సాగుతుంది. మొదటి దశలో హిమాయత్ సాగర్- ఉస్మాన్ సాగర్‌ల నుంచి బాపుఘాట్ వరకు 21 కిలోమీటర్లు మూసీ నదిని ఇరు-వైపులా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సర్కార్ నిర్ణయించింది. బాపూఘాట్ వద్ద గాంధీసరోవర్ పేరుతో అతిపెద్ద గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ సిద్ధం చేసింది. 21 కిలోమీటర్ల పొడవున నదిని, పరివాహక ప్రాంతాలను, బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్‌ను రూ.5 వేల 812 కోట్లతో అభివృద్ధి చేయాలని సంకల్పించారు.

## రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు... పరిశ్రమలు, విద్యాలయాలకు పెద్దపీట

### రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర

**అమరావతి,మార్చి 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**భూ కేటాయింపులపై కీలక నిర్ణయాలు..** రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న




ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు.

**గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీ..** దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి వివరించారు.

**నీటి కాలుష్య నివారణ చట్టానికి ఆమోదం..** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం-2024'ను రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

**ఉద్యోగినుల కోసం 'సఖీ నివాస్' హాస్టళ్లు..** మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

**వ్యాపారులకు జీఎస్టీ ట్రైబ్యునల్స్..** జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రైబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

## అన్నదాతలకు కూటమి ప్రభుత్వం ఉగాది కానుక

- అన్నదాత సుఖీభవ పథకం-రైతన్నలకు వరం
- రైతన్నలు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- రైతు సంతోషంగా ఉంటే.. రాష్ట్రం ఆనందంగా ఉంటుంది
- సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నాము
- జిల్లాలో మూడవ విడతగా రూ 89.85 కోట్లు 1,60,968 రైతులకు లబ్ధి
- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్" మూడవ విడత కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి తో పాటు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు

**ఏలూరు/ ముసునూరు,మార్చి 13 (వార్తాప్రభ) :** ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామంలో శుక్రవారం "అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్" మూడవ విడత కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు. నూజివీడు నియోజకవర్గం 35,529 మంది రైతులకు రూ 19.77 కోట్లు, ముసునూరు మండలం 8,205 మంది రైతులకు రూ 4.64 కోట్లు నమూనా చెక్కులను మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంయుక్తంగా రైతులకు అందజేశారు.





ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉంటే.. రాష్ట్రం ఆనందంగా ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం రైతుకి అన్నివిధాలుగా వెన్నంటి ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రైతాంగానికి పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ 6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ 14 వేలు కలిపి మొత్తంగా రూ 20 వేలు సాయం మూడు విడతలుగా అందిస్తున్నామని తెలిపారు. రైతాంగం తరపున ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతులు మీద, వ్యవసాయం మీద ఎంతో శ్రద్ధ ఉందని, దీని దృష్టిలో పెట్టుకుని చింతలపూడి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, దీనివల్ల ఈ ప్రాంత సుమారు 2 లక్షలు ఎకరాలకు సాగునీరు, 10 నుండి 15 వేలు మంది రైతులకు మేలు జరుగుతుందని, ఈ ప్రాంత భూములకు మంచి విలువ పెరుగుతాయని ఆలోచనతో ఆరోజు ఒక మంచి కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని అన్నారు. గత ప్రభుత్వం చింతలపూడి ప్రాజెక్టు పనులు గాలికి వదిలేసారని రూ 4 వేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరు చేశారని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే చంద్రబాబుకి పేరు వస్తుందని గత పాలకులు విషపు ఆలోచనలుతో ప్రాజెక్టు పనులు పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే చింతలపూడి ప్రాజెక్టుకు ఉన్న కేసులు సుప్రీంకోర్టులో రైతులకు అనుకూలంగా తీర్పు తేగలిగామని అన్నారు. త్వరలో చింతలపూడి ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు చిరకాల కోరికను నెరవేర్చి తీరుతామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలువలు, చెరువులు, డ్రైన్ల నిర్వహణను పట్టించుకోని కారణంగా చిన్నపాటి వర్షాల కారణంగా గ్రామాలు ముంపునకు గురయ్యేవన్నారు. జలధార కార్యక్రమం కింద ఏప్రిల్ 1వ తేదీ నుండి 90 రోజులపాటు కాలువలు, చెరువులు, డ్రైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నామన్నారు.

**మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 1వ అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) వారి కోర్టులో**

I. A.No.132/2025
in
O.S . No. 182/2025

Between:
కొండపల్లివెంకట రామానుజ రావు & అదర్స్
-----పిటీషనర్స్ /వాదులు
మరియు
ది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రికల్) ఇంజినీర్(ఆపరేషన్స్), సెక్షన్. D3,APCPDCL, మచిలీపట్నం & అదర్స్
----- రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

TO:-
**7వరెస్పాండెంట్ /ప్రతివాది :** 7) వడ్డి శ్రీకాంత్ S/o. నాంచారయ్య, R/o. D.No. 16/90-3, వలంద పాలెం, మచిలీపట్నం.

పై నెంబరు I.A. 132 /2025 in O.S. 182 /2025లో 7వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం ది 24.03.2026 నకు వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం గం. 10.30ని. లకు పైకోర్టు వారి యెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాదిద్వారా గానీ హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీపరోక్షమున తదుపరి గ్రంథములు జరుపబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

**(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)**
**వాయిదా తేది :24.03.2026**

**S.S.S. సాయిబాబు**
**P. ఉమా గిరి**
**న్యాయవాదులు, మచిలీపట్నం**

**మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 1వ అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) వారి కోర్టులో**

O.S . No. 182/2025

Between:
కొండపల్లివెంకట రామానుజ రావు & అదర్స్ -----వాదులు
మరియు
ది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రికల్) ఇంజినీర్(ఆపరేషన్స్), సెక్షన్. D3,APCPDCL, మచిలీపట్నం & అదర్స్
-----ప్రతివాదులు

TO:-
**7ప్రతివాది :** 7) వడ్డి శ్రీకాంత్ S/o.నాంచారయ్య, R/o. D.No. 16/90-3, వలందపాలెం, మచిలీపట్నం.

పై నెంబరు O.S. 182 /2025లో 7వ ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం ది 24.03.2026 నకు వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం గం. 10.30ని. లకు పైకోర్టు వారి యెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాదిద్వారా గానీ హాజరై మీకు గల అక్షేపణలు తెలుపు కొనగలరు. లేని యెడల మీపరోక్షమున తదుపరి గ్రంథములు జరుపబడునని ఇందుమూలంగా తెలియ చేయడమైనది.

**(శ్రీకోర్టు వారి ఉత్తర్వులప్రకారం)**
**వాయిదా తేది :24.03.2026**

**S.S.S. సాయిబాబు**
**P. ఉమా గిరి**
**న్యాయవాదులు, మచిలీపట్నం**

### దస్తావేజులు పోయినవి

ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ టౌన్, గుణదల, పడవలరేవు, డోరు నెం.**45-1-63** కాపురస్తుడు మడివల్లి రాజు గారి కుమారుడు మడివల్లి రాజకిషోర్ అను నేను నా నాయనమ్మగారైన మడివల్లి వేంరమ్మకు చెందిన విజయవాడ సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రీ కాబడిన దస్తావేజులు అనగా **10531/1941**గా గల విక్రయ దస్తావేజు మరియు నా తండ్రిగారైన మడివల్లి రాజు గారికి చెందిన **265/బి3/1981**గా గల వీలునామా ఒరిజినల్ దస్తావేజులతోపాటు మరికొన్ని కాగితములు కలిగిన కవర్‌ను బండికి తగిలించుకొని మా ఇంటి వద్ద నుండి మాచవరంలో జిరాక్సు తీయించుకునేందుకు వెళ్లు సందర్భంలో ది.**05-03-2026**వ తేదీన మార్గమధ్యంలో జారిపడిపోయినవి. వెంటనే చుట్టుప్రక్కల ఎక్కడ వెదకిననూ ఒరిజినల్ ఇంటి కాగితములు కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజులు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగ పరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజును ఎవరికినీ తాకట్టు పెట్టుట గానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగియుండలేదని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

సెల్ నెం.**9676079111**

## విలువలతో కూడిన రాజకీయాల్లోకి యువత రావాలి

### -భారత గౌరవ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపు



**న్యూఢిల్లీ, మార్చి 13 (వార్తాప్రభ) :** యువతే దేశ భవిష్యత్తు అని, వారు సిద్ధాంతాలు, విలువల ప్రాతిపదికన రాజకీయాల్లోకి రావాలని భారత దేశ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో (నెం. 1 త్యాగరాజ మార్గ్) శుక్రవారం పూణేలోని 'ఎంఐటి స్కూల్ ఆఫ్ గవర్నెన్స్' కు చెందిన ఎం.ఏ. పొలిటికల్ లీడర్‌షిప్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం వారితో ముచ్చటించి వారు అడిగిన సందేహాలను తీర్చారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాజకీయాల్లో అసహనానికి చోటు ఉండకూడదని, ప్రత్యర్థులను శత్రువులుగా చూడకుండా వారి అభిప్రాయాలను గౌరవించే సంస్కృతిని అలవర్చుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో నేతల ప్రవర్తన, భాష హుందాగా ఉండాలని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న శక్తి అపారమని, ప్రజలు బూతులు మాట్లాడే నేతలను ఓడిస్తారని స్పష్టం చేశారు. "యువత రాజకీయాల్లోకి మరింత ఎక్కువగా రావాలి. అయితే అది కేవలం అధికారం కోసం కాకుండా సిద్ధాంతాలు, విలువలు, ప్రజా జీవితంలో ఉన్నత ప్రమాణాలు, నిజాయితీ, మంచి ప్రవర్తనతో కూడిన రాజకీయం కోసం అయి ఉండాలి. రాజకీయాల్లో మొదటి సూత్రం అవతలి వారి దృక్పథాన్ని గౌరవించడం. రాజకీయ నాయకుడికి ఇతరుల మాట వినే ఓపిక ఉండాలి. ఒకవేళ ఏకీభవించకపోతే గౌరవప్రదంగా విభేదించాలే తప్ప వ్యక్తిగత దాడులు చేయకూడదు. ఎదుటిపార్టీలో ఉన్నవారు రాజకీయ ప్రత్యర్థులే కానీ శత్రువులు కాదన్నది గుర్తుంచుకోవాలి. 'గౌరవప్రదంగా విభేదించడం' ప్రజాస్వామ్య లక్షణం. అడ్డంకులు సృష్టించే రాజకీయం కంటే అభివృద్ధి, నిర్మాణాత్మక చర్చలు అవసరం." అని స్పష్టం చేశారు. రాజకీయాల్లో సోమరితనానికి చోటు లేదని, క్రమశిక్షణతో కూడిన సమయ పాలనే తనను ఈ స్థాయికి చేర్చిందని ఆయన వివరించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె. అద్వానీ వంటి నేతల సమయ పాలనను ఆయన ఉదహరించారు. తాను ఎప్పుడూ వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని, తన కుటుంబ సభ్యులను కూడా స్వశక్తితో ఎదగాలని ప్రోత్సహించానని ఆయన స్పష్టం చేశారు. నాయకులు పారాచూట్ లాగా దిగకూడదని, క్షేత్రస్థాయి నుంచి కష్టపడి పైకి రావాలని సూచించారు.

## జర్నలిస్ట్ మిత్రులకు ఉగాది పురస్కారాలు

- జర్నలిస్టు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- ప్రభుత్వ పరిశీలనలో జర్నలిస్ట్ పెన్షన్ స్కీమ్
- వెటరన్ జర్నలిస్ట్ లకు వారు కోరిన జిల్లాలో ఉచిత బస్ పాస్ సౌక్యం కల్పిస్తాం
- జర్నలిస్ట్ లకు త్వరలో శుభవార్త చెప్తాం
- ఏపీఎంపీఏ నేతలతో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**అమరావతి,మార్చి 13 (వార్తాప్రభ) :** జర్నలిస్ట్ మిత్రులకు ఉగాది పురస్కారాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర సమాచార సంబంధాల శాఖ కొలుసు పార్థసారథి చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో జర్నలిస్టుల సంక్షేమానికి పలు పథకాలను ప్రభుత్వం ప్రకటిస్తుందని కొలుసు పార్థ సారథి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం మంత్రిని మీడియా సెంటర్ లో కలసి జర్నలిస్టుల పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ త్వరలోనే తీపి కబురు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ యాదవ్ తో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ వెటరన్ జర్నలిస్టులు దూర ప్రాంతాల నుంచి విజయవాడ వచ్చి రాష్ట్ర కార్యాలయంలో బస్ పాసులు తీసుకోవడం వల్ల సొంత జిల్లాల్లో బస్సు సౌకర్యం కల్పించడం లేదని, వారికి సొంత జిల్లాలోనే పాసులు కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందిగా మంత్రి ని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ వెటరన్ జర్నలిస్టులకు పనిచేసే చోటే బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని కమిషనర్ ను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాబినెట్ లో జర్నలిస్టుల సమస్యలపై చర్చించామని త్వరలోనే వారికి శుభవార్త చెబుతామని తెలిపారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం అవార్డుల పంపిణీ తో పాటు ప్రమాద బీమా సౌకర్యం,20 లక్షలకు హెల్త్ కార్డుల పరిమితి పెంచడంతో పాటు పలు జర్నలిస్ట్ సంక్షేమ కార్యక్రమాలపై త్వరలోనే ఇది విధానము ప్రకటిస్తామని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఏ.పి.ఎం.పి. ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, విజయవాడ నగర అధ్యక్షులు టి అనిల్ కుమార్, జనరల్ సెక్రెటరీ జి శ్రీనివాసరావుతో పాటు పలువురు జర్నలిస్టులు ఉన్నారు.

# మార్చి 14న నూజివీడులో జాతీయ లోక్ అదాలత్

- కేసుల పరిష్కారానికి సువర్ణావకాశం.
- గౌరవ 15వ అదనపు జిల్లా జడ్జి ఏ. నాగశైలజ గారు



**నూజివీడు,మార్చి 13 (వార్తాప్రభ) :** నూజివీడు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ (రెండవ శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ మరియు 15వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి ఏ. నాగశైలజ గారు తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులను ఉభయ పక్షాల అంగీకారంతో, రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి ఇది ఒక మంచి అవకాశమని వారు పేర్కొన్నారు.

**సమయం, ఖర్చు ఆదా:** ఈ సందర్భంగా జడ్జి గారు మాట్లాడుతూ, కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయవాదుల ద్వారా ఇరు పార్టీలు హాజరై రాజీ కుదుర్చుకోవచ్చని సూచించారు. దీనివల్ల అనవసర కోర్టు ఖర్చులు తగ్గడమే కాకుండా, విలువైన సమయం ఆదా అవుతుందని వివరించారు. లోక్ అదాలత్ ద్వారా లభించే తీర్పుకు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన గుర్తింపు ఉంటుందని ఆమె గుర్తు చేశారు.

**పరిష్కారమయ్యే కేసులు:** ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న అన్ని రకాల క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా (ఎం వి ఓ పి) కేసులు మొదలైన వాటిని పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

**సంప్రదించవలసిన చోటు:** లోక్ అదాలత్‌కు సంబంధించి ఇతర వివరాలు లేదా సందేహాలు ఉన్నవారు నూజివీడు కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సర్వర్ ఇబ్బందుల వలన గ్యాస్ బుకింగ్ ఆలస్యం అవుతుంది

మండల తాసిల్దార్ కే లక్ష్మి కుమారి



**విస్సన్నపేట,మార్చి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో గ్యాస్ వినియోగదారులకు సర్వర్ ఇబ్బందుల వలన సంబంధిత బుకింగ్ నెంబర్ కు ఆలస్యంగా బుక్ అవుతున్నాయని మండల తాసిల్దార్ కే లక్ష్మి కుమారి తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాలలో 45 రోజుల తర్వాత రెండవసారి గ్యాస్ బుక్ చేసుకోవాలని ఆమె తెలిపారు. ఎంపీడీవో చిన్న రాట్నాలు మాట్లాడుతూ ఇంటి పన్నులు, నీటి కుళాయిల పన్నులు త్వరితగతిన స్వర్ణ పంచాయితీ ఖాతాకు జమ చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, పారిశుద్ధ్య రిక్షాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొలికపూడి



**విస్సన్నపేట,మార్చి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ ప్రాంగణంలో తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు గ్రామపంచాయతీలకు పారిశుద్ధ్య రిక్షాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు, మండల తాసిల్దార్ కే లక్ష్మి కుమారి, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వీరవల్లి గ్రామంలో గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్ వ్యాక్సిన్ ప్రారంభం



**హనుమాన్ జంక్షన్,మార్చి 13 (వార్తాప్రభ) :** హ్యూమన్ పాపిల్లోమావైరస్ ఇన్ఫెక్షన్ (గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్) నివారణలో భాగంగా 14 సంవత్సరాలు జరుగుతున్న ఆడపిల్లలకు 13/03/26 వ తేదీన హెచ్ పి వి వ్యాక్సిన్, రాష్ట్ర రైతు కార్యనిర్వహన కార్యదర్శి గుండపనేని ఉమావరప్రాసాద్ (బుజ్జి), సర్పంచ్ పిల్ల అనిత, ఉప సర్పంచ్ లంకా అజయ్, మండాది రవీంద్ర, ఇలప్రోలు నల్లిని కాంత్ మరియు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు డా. కిరణ్మయి, డా. ప్రణయ్ సాగర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. హెచ్ పి వి వ్యాక్సిన్ పలురకాల క్యాన్సర్ల నివారణకు ఉపయోగపడుతుందని బయట ధర పదివేలరూపాయల పైనేనని, ప్రభుత్వం ఉచితంగా ఈ వ్యాక్సిన్ అందిస్తుందని, 14 సంవత్సరాలు జరుగుతున్న ఆడపిల్లలు కలిగి ఉన్నవారందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వీరవల్లి గ్రామ నాయకులు తెలియపరిచారు. డా. కిరణ్మయి మాట్లాడుతూ హెచ్ పి వి వ్యాక్సిన్ 2006 నుండే అందుబాటులో ఉందని, ఈ వ్యాక్సిన్ వలన ఎలాంటి తీవ్ర దుష్ప్రభావాలు లేవని, వాక్సిన్ తీసుకున్న వారికి ఇంజెక్షన్ స్థలంలో నొప్పి, ఎరుపు, వాపు, జ్వరం, అలసట, బలహీనత ఉండవచ్చు ఇవి 2-3 రోజుల్లో వాటంతటికీ అవే తగ్గుతాయని అన్నారు.

# ఎస్వీసిఈ లో ఘనంగా అంతర్జాతీయ గణిత దినోత్సవ వేడుకలు





**తిరుపతి,మార్చి 13 (వార్తాప్రభ) :** స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఐటి వరంగల్ విశ్రాంత గణితాచార్యులు డాక్టర్ జి.రాధాకృష్ణమాచార్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయ గుంటూరు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి .రాధాకృష్ణమాచార్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదివే కంప్యూటర్ సైన్స్ ,సివిల్ ,మెకానికల్ ,ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు అనుగుణంగా గణితంశాలను ఉపయోగించి వాస్తవిక ప్రపంచం లో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలను కనుగొనే విధానాన్ని క్వాంటం కంప్యూటింగ్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయ గుంటూరు మాట్లాడుతూ ఇంజనీరింగ్ సైన్స్ లో గణిత శాస్త్రం యొక్క అవినాబావ సంబంధాన్ని ,ప్రాథమిక పాత్రను క్లుప్తంగా విద్యార్థులకు తెలియజేశారు. సంఖ్యాశాస్త్రంలో కూడా నైపుణ్యాలను వృద్ధి చేసుకోవడం ఎంతో అవసరమని తద్వారా ఉద్యోగాల సాధనలో ఎంతో ఉపయోగపడతా యని ఆయన అన్నారు. గణిత విభాగాధిపతి డాక్టర్ కె.వెంకటేశ్వర రాజు మాట్లాడుతూ అంతర్జాతీయ గణిత దినోత్సవం ఒక్క విశిష్టతను ,పైడేను గుర్తించిన విధానాన్ని క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు . ఈ కార్యక్రమంలో గణిత విభాగధ్యాపక బృందం మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# రామాలయం, అభయాంజనేయస్వామి ఆలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన పుట్టగుంట సతీష్ కుమార్





**హనుమాన్‌జంక్షన్,మార్చి 13 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ లోని ప్రసిద్ధ శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం, శ్రీరామాలయం వద్ద భక్తుల కు సౌకర్యాలు కల్పించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు తన స్వంత నిధులతో నిర్మించనున్న పనులకు ప్రముఖ పారిశ్రామిక వేత్త,విశ్వ హిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ముందుగా చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ఆలయ అర్చకులు పుట్టగుంట సతీష్ కుమార్ కు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయించారు. స్వామి వారి చిత్ర పటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పుట్టగుంట సతీష్ కుమారుడు ఆతీష్ ,సీనియర్ జర్నలిస్ట్, లయన్ తాడి రంగారావు, ట్రస్ట్ సభ్యులు అక్కపోలు సుజాత, కొక్కిరపాటి రామచంద్రయ్య, మూల్పూరి గోపీచంద్, తెలుగు మహిళ నాయకురాలు వడ్డి వాసవీ తదితరులు పాల్గొన్నారు.

# అన్న దాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**అమలాపురం,మార్చి 13 (వార్తాప్రభ) :** అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ మూడో విడత, 22 వ పీఎం కిసాన్ పథకం క్రింద అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడం జరుగు తుందని. జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ వెల్లడిం చారు. 2025-26 ఆర్థిక సంవత్స రంలో మూడో విడత అన్నదాత సుఖీభవ 22వ విడత పీఎం కిసాన్ నిధులు జిల్లా వ్యాప్తంగా 1, 34,829 అన్నదాతలకు టుంబాలకు రూ. 77.01 కోట్లు జమ కాబడి లబ్ధిచే కూరిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అన్నదాతలు ఈ యొక్క నిధులను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసా టిగా మార్చుకోవాలన్నారు అన్నదాత సుఖీభవ కింద ప్రస్తుత మూడో విడత లో1,34,829 రైతు కుటుం బాలకు రూ.4 వేలు చొప్పున రూ 53.93 కోట్లు మేర లబ్ధి చేకూరిందని అదేవిధంగా 22 విడత పిఎం కిసాన్ కింద రూ 2 వేలు చొప్పున జిల్లావ్యా ప్తంగా1,15,400 రైతు కుటుంబాలకు రూ 23.08 కోట్లు మేర నిధులు జమ కాపడ్డాయన్నారు. అమలాపురం నియోజకవర్గం లో అన్నదాత సుఖీభవ కింద 13,403 రైతు కుటుంబా లకు రూ 4 వేలు చొప్పున రూ.5.36 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.2 వేలు చొప్పున 12,432 రైతు కుటుంబాలకు రూ.2.49 కోట్లు జమ కాబడ్డాయ న్నారు, కొత్తపేట నియోజ కవర్గంలో అన్నదాత సుఖీ భవ కింద 23,085 రైతు లకు రూ 9.23 కోట్లు, పీఎం కిసాన్ కింద 18,546 రైతులకు రూ.3.71 కోట్లు,మండపేట నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ కింద 18,282 రైతులకు రూ.7.31 కోట్లు, పీఎం కిసాన్ కింద 16,339 రైతులకు రూ 3.71 కోట్లు, ముమ్మిడివరం నియోజకవర్గంలో అన్నదాత సుఖీ భవ కింద 19,519 రైతులకు రూ.7.81 కోట్లు,పీఎం కిసాన్ కింద 14,615 రైతులకు రూ 2.92 కోట్లు, పి.గన్నవరం నియోజక వర్గంలో అన్నదాత సుఖీ భవ కింద 23,796 రైతు కోట్లు రూ 9.52 కోట్లు, పీఎం కిసాన్ కింద 21,483 రైతులకు రూ. 4.30 కోట్లు, రామచంద్రపురం నియో జకవర్గంలో అన్నదాత సుఖీభవ క్రింద 15,272 రైతులకు రూ 6.11 కోట్లు, పీఎం కిసాన్ కింద 14,402 రైతులకు రూ2.88 కోట్లు,రాజోలు నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ కింద 21,472 రైతులకు రూ.8.59 కోట్లు, పీఎం కిసాన్ కింద 17,583 రైతులకు రూ.3.52 కోట్లు జమ కాపడ్డాయన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం రైతుల ఆర్థిక స్థిరత్వానికి,వ్యవసాయ రంగం బలోపేతానికి దోహదం చేస్తుందన్నారు. రైతులు పంటలు వేసే నాటికి అవసరమైన పెట్టుబడి సాయం. అందించడం ద్వారా అన్నదాతల క్షేమం సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. రైతులకు రుణభారం లేకుండా చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించ డంలోనూ ప్రభుత్వం కీలకంగా వ్యవహరిస్తోందని వివరించారు. వ్యవసాయ యోగ్యమైన సొంత భూమి కలిగి ఉన్న రైతు కుటుంబాలకు భూవిస్తీర్ణంతో సంబం ధం లేకుండా, అటవీ హక్కుల గుర్తింపు భూములు సాగు చేస్తున్న రైతు కుటుంబానికి పెట్టుబడి సాయంగా సంవత్సరానికి మూడు విడతలుగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.6000తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి రూ. 14,000 చొప్పున మొత్తంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద ఏడాదికి మొత్తం రూ.20వేలు చొప్పున ఆర్థిక మద్దతు కల్పిస్తు న్నట్లు వివరించారు. ఈ పథకం ద్వారా అందుతు న్న ఆర్థిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. నిధులను ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాలు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 7 నియోజ కవర్గంలో జరిగాయని తెలిపారు.

# వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన పెద్దలు





**విస్సన్నపేట,మార్చి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని, మాజి మంత్రివర్యులు జోగి రమేష్, తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్ సుధారాణి దంపతులు, వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు, జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, తిరువూరు జడ్పిటిసి రామచంద్రారెడ్డి,ఎంపీపీ గద్దల మల్లయ్య, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు,గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు దంపతులు, కొండ పర్వ గ్రామ సర్పంచ్ రమేష్ బాబు, కొండపురం మాజీ సహకార సంఘం అధ్యక్షులు చంద్రశేఖర రావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి సిరసాని ప్రకాష్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎన్ వి కుటుంబరావు, తిరువూరు నియోజకవర్గ యూత్ నాయకులు దేశి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు చింతల ప్రసాదరెడ్డి, వార్డ్ మెంబర్ పిల్లి రాజేష్ , ఎల్ పవన్, చందా,ముంగా జయరాజ్, పి లక్ష్మయ్య జయకర్ లాలయ్య, తిరుపతిరావు వెంగళ బ్రదర్స్ అడ్డగట్ల శ్రీను బీసీ నాయకులు సతీష్, కాపు నాయకులు శీలం శ్రీను, రాము వరపు శ్రీను, దుర్గ, మండల యూత్ అధ్యక్షులు ఆలీ కో ఆప్షన్ నెంబర్ జాఫర్ బాబా, జిల్లా మైనారిటీ జనరల్ సెక్రెటరీ దస్తగిరి, భూక్యరాణి తదితరులు పాల్గొన్నారు. తొలుత దేశ నేతలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలదండలు వేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద వైసీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం, పార్టీ కార్యాలయం ప్రారంభం అనంతరం దివంగత జననేత వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమం అనంతరం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు అందించారు.

# ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని వారికి నీటి కనెక్షన్లు తొలగింపు - డిప్యూటీ కమిషనర్ కే. శ్రీనివాస్

**కాకినాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** కాకినాడ నగర పరిధిలో దీర్ఘకాలంగా ఆస్తి పన్ను మరియు ఇతర పన్నులు చెల్లించని నివాస గృహాలు, వ్యాపార సంస్థలపై నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. పన్ను బకాయిలు చెల్లించని గృహాలు మరియు వ్యాపార సంస్థలకు సంబంధించి నీటి కుళాయి (ట్యాప్) కనెక్షన్లను తొలగించే ప్రక్రియను ప్రారంభించినట్లు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కే. శ్రీనివాస్ తెలిపారు. ప్రజలకు సౌలభ్యం కల్పించే ఉద్దేశంతో ఈ నెల 14, 15 తేదీల్లో రెండవ శనివారం మరియు ఆదివారం రోజుల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆస్తి పన్ను, నీటి కుళాయి పన్ను,వాటర్ మీటర్ చార్జీలు మరియు ఖాళీ స్థలాల పన్నులను చెల్లించేందుకు అవకాశం కల్పించబడిందని తెలిపారు.

కాకినాడ సినిమా రోడ్డు వద్ద ఉన్న పాత మున్సిపల్ కార్యాలయంలో, శారదమ్మ గుడి సమీపంలోని మున్సిపల్ కార్యాలయంలోతో పాటు ఆయా వార్డు సచివాలయ కార్యాలయాలలో కూడా పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. పన్నులు సకాలంలో చెల్లించని వారికి నీటి ట్యాప్ కనెక్షన్లను తొలగించే చర్యలు తప్పవని డిప్యూటీ కమిషనర్,నగర ప్రజలు తమ బకాయిలను వెంటనే చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

# కుంటముక్కలలో శరవేగంగా సిసి రోడ్ల నిర్మాణ పనులు

- కుంటముక్కల గ్రామంలో రూ.15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం
- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో రూ. 40 లక్షలతో జరుగుతున్న సిసి రోడ్డు పనులు





**జి.కొండూరు,మార్చి 13 (వార్తాప్రభ) :** పల్లె పండుగ 2.0 లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండలంలోని కుంటముక్కల గ్రామంలో, ఆ గ్రామ శివారు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో సీసీ రోడ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నా రు. కుంటముక్కల గ్రామంలో రూ.15 లక్షలతో 200 మీటర్లు పొడవు, 3.75 మీటర్ల వెడల్పుతో సిసి రోడ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో రూ. 40 లక్షలతో 350 మీటర్ల పొడవు, 4.5 మీటర్ల వెడల్పు తో సిసి రోడ్ నిర్మాణ పనులు జరుగు తున్నాయి.కుంటముక్కల పిఎసిఎస్ చైర్మన్ సుఖవాసి శ్రీహరి,పంచాయతీరాజ్ శాఖ ఏఈ సాంబశివరావు దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తు న్నారు.స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సహకారంతో నాణ్యతతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని శ్రీహరి వెల్లడించారు. సీసీ రోడ్లు నిర్మించడం పట్ల కుంటముక్కల గ్రామస్తులు అలాగే గురుకులం విద్యార్థినులు హర్షం వ్యక్తం.

# మతసామరస్యం ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్ విందు - ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** మతసామరస్యం,ఆత్మీయతకు ప్రతిక ఇఫ్తార్ విందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం రాత్రి గుడివాడ రూరల్ మండలంలోని మల్లాయిపాలెంలో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలను ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో పాటిస్తారన్నారు. పవిత్రమైన రంజాన్ మాస ప్రార్థనల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి,టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్‌మోహన్ రావు, రమణ ప్రసాద్, షేక్ సర్కార్, మహమ్మద్ రఫీ, మల్లయ్య పాలెం గ్రామ మైనార్టీ నాయకులు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

# నూజివీడు పట్టణంలో ముమ్మరంగా విజిబుల్ పోలీసింగ్' ప్రజల్లో భద్రతా అవగాహన కల్పించిన పోలీసు లు

- హెల్మెట్ ప్రాణ రక్షా కవచం.వేగం వద్దు ప్రాణం ముద్దు అని నూజివీడు టౌన్ ఇన్స్పెక్టర్ సత్య శ్రీనివాస్ వెల్లడి.



**నూజివీడు,మార్చి 13 (వార్తాప్రభ) :** నూజివీడు డిఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ యొక్క ఆధ్వర్యములో టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ సత్య శ్రీనివాస్ గారు మరియు ఎస్సై నాగేశ్వర రావు గారు తమ సిబ్బందితో కలిసి ఈ రోజు అనగా 13. 03.2026 వ తేది నాడు పట్టణ పరిధిలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొం దించడం మరియు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించ డమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇన్స్పెక్టర్ సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదాలను గుర్తించి వారి పై జరిమానాను విధించకుండా వారిచే హెల్మెట్ కొనుగోలు చేయించిన నూజివీడు టౌన్ ఇన్స్పెక్టర్ ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలను కాపాడే ఏకైక రక్షా కవచం హెల్మెట్ అని గుర్తుచేశారు. వేగం వద్దు ప్రాణం ముద్దు అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, అతి వేగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. తనిఖీల్లో భాగంగా మైనర్లు వాహనాలు నడపడం పై నూజివీడు టౌన్ ఇన్స్పెక్టర్ గారు తీవ్రంగా స్పందించారు. పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాల బారిన పడేయవద్దని తల్లిదండ్రులకు సూచిస్తూ, చట్టపరమైన చర్యల గురించి వివరించారు. ద్విచక్ర వాహనాలకు ఉన్న సైలెన్సర్లను తొలగించి, భారీ శబ్దాలతో ప్రజలను ఇబ్బంది పెట్టే వాహనాలను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రయాణించే ప్రతి వాహనదారుడు తమ కోసం ఇంట్లో ఒక కుటుంబం వేచి చూస్తోందనే విషయాన్ని మర్చిపోకూడదని నూజివీడు టౌన్ ఇన్స్పెక్టర్ పిలుపు నిచ్చారు. సురక్షిత ప్రయాణం ద్వారానే గమ్యస్థానాన్ని క్షేమంగా చేరుకోగలమని తెలిపారు. ఈ ఫుట్ పెట్రోలింగ్ ద్వారా పట్టణ ప్రజలలో భద్రతా నమ్మకం పెరిగిందని, నేరాల నివారణకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీస్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సి పరీక్షల సందర్భంగా ఎగ్జామ్స్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు.

**మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి .**



**ఎల్బీనగర్/వార్తప్రభ (మార్చి 13):** ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిషేధాజ్ఞలు అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు.పరీక్షా కేంద్రాల 200 మీటర్ల పరిధిలో నలుగురికి పైగా గుమికూడడాన్ని నిషేధించారు. అలాగే పరీక్షల సమయంలో కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు.పోలీసులు, సైనిక సిబ్బంది, హోం గార్డులు, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులకు ఈ ఆదేశాల నుంచి మినహాయింపు ఉంటుందని సిపి తెలిపారు.

## లింగాపూర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి!!

**29వ డివిజన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించండి**

**మేయర్ మహంకాళి స్వామికి కార్పొరేటర్ రజిని విన్నపం**




**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 13 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 29వ డివిజన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని శుక్రవారం మేయర్ మహంకాళి స్వామికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన లింగాపూర్ గ్రామాన్ని నగర తరహాలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం అధిక నిధులు కేటాయించి రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీరు, సాగునీరు వంటి మౌలిక వసతులను మెరుగుపరచాలని ఆమె విన్నవించారు. మేయర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో కార్పొరేటర్ విన్నపానికి మేయర్ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే 29వ డివిజన్‌లో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్‌కు కార్పొరేటర్ రజిని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విలీన గ్రామానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము నిరంతరం శ్రమిస్తామని ఈ సందర్భంగా కార్పొరేటర్ వివరించారు.

## ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ మార్చ్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** మున్సిపాలిటీ పరిధిలోని హమాలీవాడలో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా స్పెషలిస్ట్ మెడికల్ క్యాంప్ ను స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు జిల్లా పరిపాలన అధికారులను అభినందించారు.ప్రజలు చికిత్స కోసం మహారాష్ట్రలోని యవత్మాల్ ఆసుపత్రులకు వెళ్లడం వల్ల రోజుకు సుమారు 20 నుంచి 30 లక్షల రూపాయల వరకు ప్రజల డబ్బు బయటకు వెళ్తోంది అని తెలిపారు

## నాయకుడివై నడువు!!




నీ నీడను చూసి నువ్వు భయపడకు,
నీ అడుగు జాడలను పరులకు వదలవు.
అనుచరుడిగా వెనుక అడుగులు వేయకు,
నాయకుడిగా ముందుండి బాటలు వేయవు!!
మందలో ఒకడిగా కలిసిపోవద్దు,
మందకే దిశను చూపే వెలుగువు కావాలి.
వంగి వంగి దండాలు పెట్టే బానిసవు కాదు,
నేరుగా నిలబడి పోరాడే వీరుడివి కావాలి!!
ఓటమి ఎదురైతే కుంగిపోవద్దు,
గెలుపు తలుపులు తట్టే వరకు ఆగద్దు.
ఎవరో వస్తారని ఎదురుచూడకు,
నీవే ఒక సైన్యమై కదం తొక్కాలి!!
సాకులు వెతికేవాడు సగటు మనిషి,
మార్గం వెతికేవాడు అసలైన మహర్షి.
సింహం ఎప్పుడూ గుంపుగా రాదు,
నాయకుడు ఎవరి అండ కోసం చూడడు!!
నీలోని శక్తిని నువ్వు తక్కువ అంచనా వేయకు,
శిఖరాన్ని అధిరోహించే వరకు విశ్రమించకు.
చరిత్ర అడిగితే నీ పేరు చెప్పేలా,
లోకం నిన్ను చూసి గర్వపడేలా!!

**గడ్డం సంతోష్ రాజ్**
గోదావరిఖని

# విద్యార్థులకు అలర్ట్!!

**● కౌన్సిలింగ్ తరగతులు ప్రారంభం ● షెడ్యూల్ విడుదల చేసిన ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ ● సమాచారాన్ని గమనించి రిజిస్టర్ చేసుకోవాలి ● డా.సుబ్బారావు**

| వివరాలు | సమాచారం |
|---|---|
| ప్రారంభ తేదీ | మార్చి 15, 2026 |
| రోజు | ప్రతి ఆదివారం |
| సమయం | ఉదయం 9:00 నుండి సాయంత్రం 5:00 వరకు |
| సెమిస్టర్లు | 2వ, 4వ మరియు 6వ సెమిస్టర్ |

**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 13 (వార్తాప్రభ ప్రతినిధి)** గోదావరిఖనిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం స్టడీ సెంటర్--055లో డిగ్రీ విద్యార్థులకు కౌన్సిలింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల మార్చి 15, 2026 నుండి తరగతులు నిర్వహించబడతాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు చెందిన 2వ, 4వ, 6వ సెమిస్టర్ విద్యార్థులు ఈ తరగతులకు హాజరుకావచ్చు. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కౌన్సిలింగ్ సెషన్లు కొనసాగుతాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్దేశించిన సమయానికి హాజరు కావాలని యాజమాన్యం సూచించింది. విద్యాపరమైన సందేహాల నివృత్తికి ఈ




తరగతులు ఎంతో ఉపయోగపడతాయని వారు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మరిన్ని వివరాల కోసం గోదావరిఖని స్టడీ సెంటర్‌ను నేరుగా సంప్రదించవచ్చు అని తెలిపారు. క్రమం తప్పకుండా తరగతులకు హాజరై సబ్జెక్టులపై పట్టు సాధించాలని విద్యార్థులను కోరారు. ఈ ప్రకటనతో విద్యార్థుల్లో తమ సెమిస్టర్ పరీక్షల ప్రిపరేషన్ పట్ల స్పష్టత రానుంది. సంబంధిత విద్యార్థులందరూ ఈ సమాచారాన్ని గమనించి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

# మురుగు కంపులో టీచర్స్ కాలనీ!!

**● మూడు దశాబ్దాల నరకయాతన ● అక్షరాస్యుల అడ్రస్‌లో అపరిశుభ్రత ● మారిన ప్రభుత్వాలు.. మారని తలరాతలు ● దోమల దండయాత్ర - రోగాలమయంగా కాలనీ ● విషపురుగుల నీడలో నిత్య భయం ప్రజా పాలనపైనే ఆఖరి ఆశ ● డిమాండ్ ఒక్కటే అండర్ డ్రైనేజ్ ం బిటీ రోడ్**





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 13 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నగరంలో విద్యావంతులు, మేధావులు నివసించే టీచర్స్ కాలనీ ఇప్పుడు మురుగు కూపంగా మారి అక్షరాలా నరకాన్ని తలపిస్తోంది. గత 30 ఏళ్లుగా ఇక్కడి నివాసితులు మురుగు నీటి గబ్బు సమస్యతో సహవాసం చేస్తుండటం గమనార్హం. పాలకులు మారుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా తమ బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదని, ఓట్ల సమయంలో హామీలు ఇచ్చే నేతలు గెలిచాక కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సరైన ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరంతా నిలిచి, మురికికుంటగా మారిన పరిస్థితి నెలకొంది. ఈ మురుగు నీటి నిల్వల వల్ల దోమలు స్వైరవిహారం చేస్తూ డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్నాయి. కేవలం దోమలే కాకుండా, మురుగు కుంటల్లో విషపురుగులు, పాములు చేరుతుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడపాల్సి వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే అనేక కుటుంబాలు అనారోగ్యాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా చితికిపోతున్నాయి. వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణంగా తయారై, ఇళ్లలోకి మురుగు నీరు చేరుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించి, దానిపై నాణ్యమైన రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత "ప్రజా పాలన"లోనైనా తమకు ఈ గబ్బు సమస్య నుండి విముక్తి లభిస్తుందని, కలెక్టర్, ఎమ్మెల్యే, మేయర్, ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఈ క్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 49వ డివిజన్లోని ఈ సమస్య ప్రాంతాన్ని పరిశీలించి తాత్కాలికంగా సమస్య పరిష్కారం చేశారు. వారు కూడా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళిక సిద్ధం చేస్తామని, టీచర్స్ కాలనీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ప్రజలకు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# నర్సాపూర్ మెయిన్ రోడ్డుపై ఆక్రమణల తొలగింపు

**● రోడ్డు ప్రక్షాళన చేసిన మున్సిపల్ అధికారులు! ● హ్యాపీ చిల్డ్రన్ హాస్పిటల్ నుండి చింతల్ వెజిటబుల్ మార్కెట్ వరకు స్పెషల్ డ్రైవ్.● ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేలా ఫుట్‌పాత్‌ల క్లీనింగ్.● క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన డెప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్.**





**కుత్బుల్లాపూర్, మార్చి 13, (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని జీడిమెట్ల సర్కిల్-55 అధికారులు నర్సాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం అత్యంత వేగంగా నిర్వహించారు. హ్యాపీ చిల్డ్రన్ హాస్పిటల్ నుండి చింతల్ వెజిటబుల్ మార్కెట్ వరకు రోడ్డుకు ఇరువైపులా పాదచారులకు ఇబ్బందిగా మారిన ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

**అధికారుల పర్యవేక్షణలో ప్రక్షాళన** జీడిమెట్ల సర్కిల్ డెప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో, డెప్యూటీ ఈఈ కాసిఫ్ హుస్సేన్, ఏఈఈ జి. సాయి లిఖిత సేన్ క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించారు. రోడ్డు మార్జిన్లను ఆక్రమించి పెట్టిన దుకాణాల సామాగ్రిని, తోపుడు బండ్లను తొలగించి రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు.

**ట్రాఫిక్ సమస్యలకు చెక్** ముఖ్యంగా చింతల్ వెజిటబుల్ మార్కెట్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్న నేపథ్యంలో, రోడ్డు ఆక్రమణల తొలగింపు వల్ల వాహనదారులకు పెద్ద ఉపశమనం లభించింది. భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది మరియు మున్సిపల్ పోలీసులు పాల్గొన్నారు.

# నేరస్తులను పట్టుకున్న బ్లూ కోట్స్ సిబ్బందికి రివార్డులు: సత్కరించిన డీసీపీ కోటిరెడ్డి

**● దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ చిరంజీవి, హోంగార్డు రవీందర్‌లకు ఘన సన్మానం.**
**● వారం రోజుల వ్యవధిలోనే ముగ్గురు పాత నేరస్తులను పట్టుకున్న వైనం.**
**● శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని డీసీపీ పిలుపు.**

**దుండిగల్, మార్చి 13, (వార్తాప్రభ)** : విధి నిర్వహణలో అంకితభావం ప్రదర్శించి, పాత నేరస్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న బ్లూ కోట్స్ సిబ్బందిని కుత్బుల్లాపూర్ డీసీపీ కోటిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం దుండిగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన, వారం రోజుల వ్యవధిలో ముగ్గురు దొంగలను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుల్ చిరంజీవి, హోంగార్డు రవీందర్‌లను పోలీసు సిబ్బంది సమక్షంలో ఘనంగా సన్మానించారు.




**సమయస్ఫూర్తికి నగదు పురస్కారం** నేరం చేస్తున్న క్రమంలోనే పాత దొంగలను చాకచక్యంగా పట్టుకున్నందుకు గాను, సిబ్బందికి రూ. 1,000 (వెయ్యి రూపాయల) నగదు రివార్డును డీసీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్లూ కోట్స్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండటం వల్ల నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. మంచి పని చేసే సిబ్బందికి ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు.

**పోలీసు యంత్రాంగంలో ఉత్సాహం** డీసీపీ స్వయంగా స్టేషన్‌కు వచ్చి క్షేత్రస్థాయి సిబ్బందిని గౌరవించడం పట్ల దుండిగల్ పోలీసు వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో దుండిగల్ ఎస్‌హెచ్ఓ, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## జాగ్రత్తే సెక్యూరిటీ!!

**● డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం ● పిల్లల భద్రత తల్లిదండ్రుల బాధ్యత ● రోడ్డు భద్రతపై అశ్రద్ధ వద్దు ● అపరిచిత లింకులతో ప్రమాదం ● రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**




**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 13 (వార్తాప్రభ ప్రతినిధి)** మార్కండేయ కాలనీలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పిల్లల భద్రత, డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ... సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్ మహమ్మారి యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తోందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని, ఏవైనా అనుమానాస్పద సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు అత్యవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని, సీపీ సూచనలను శ్రద్ధగా విన్నారు. ప్రజా రక్షణే లక్ష్యంగా ఇటువంటి అవగాహన సదస్సులు నిరంతరం కొనసాగుతాయని కమిషనర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్న శేరిలింగంపల్లి లో ఇల్లు గాని, డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదు.

**. బి.జె.పి.నేత రవికుమార్ యాదవ్**





**కూకట్ పల్లి, మార్చి 13(వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజక వర్గంలో పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంద్రమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందనీ,కానీ ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా పేదలకు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.కొన్నిచోట్ల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మాణం పూర్తయినా కూడా ప్రభుత్వం వాటిని పేదలకు కేటాయించడంలో విఫలమైంది.ఈ నేపథ్యంలో పేద ప్రజలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కంటెస్టింగ్ ఎమ్మెల్యే మారబోయిన రవికుమార్ యాదవ్ బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ నాయకులు,జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.248 డివిజన్ వెంకటేశ్వర్ నగర్ నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బీజేపీ పంతంగి బాలు యాదవ్, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కుమార్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మహేందర్ రెడ్డి,స్టేట్ సీనియర్ నాయకులు సాయి మహేష్, రాజు, శంకర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.



**ఎల్బీనగర్/వార్తప్రభ (మార్చి 13):**తలకొండపల్లి మండలం, పడకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు..

# ఎడిటోరియల్

## గ్యాస్ సంక్షోభంపై కేంద్రం వర్సెస్ రాష్ట్రాలు..

### నిప్పు రాజేసిన సిలిండర్ కొరత!

వంటగదిలో ఘుమఘుమలాడాల్సిన గ్యాస్ పొయ్యిలు ఇప్పుడు రాజకీయ సెగలను వెదజల్లుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధం వల్ల అంతర్జాతీయంగా చమురు రవాణా అస్తవ్యస్తం కావడం భారత్‌లో గ్యాస్ సంక్షోభానికి దారితీసింది. అయితే, ఈ ఇబ్బందులకు కేంద్రం బాధ్యత వహించాలని రాష్ట్రాలు, రాష్ట్రాల పట్టించుకోలేని తనం వల్లే ఈ పరిస్థితి అని కేంద్రం పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ కొరత లేదని భరోసా ఇస్తున్నా, క్షేత్ర స్థాయిలో మాత్రం సామాన్యుడికి సిలిండర్ అందడం ఒక ప్రహసనంగా మారింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి వేర్వేరు వ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ గ్యాస్ కొరతపై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో సిలిండర్ల కొరత లేదని, కేవలం యుద్ధం వస్తుందనే భయంతో ప్రజలు ముందస్తుగా ఎక్కువ మొత్తంలో బుక్ చేసుకోవడం వల్లే ఈ తాత్కాలిక షార్టేజీ కనిపిస్తోందని స్పష్టం చేశారు. 'గ్యాస్ సరఫరాలో అక్రమాలకు పాల్పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత రాష్ట్రాలదే' అని ఆయన చురకలు అంటించారు. అంటే, బ్లాక్ మార్కెట్ ను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని కేంద్రం పరోక్షంగా నిలదీస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ కొరతపై మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్రంపై నిప్పులు చెరిగారు. కేంద్రం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు పొంతన లేదని విమర్శించారు. తెలంగాణకు గ్యాస్ కోటాను పెంచాలని, సరఫరాలో ఉన్న అడ్డంకులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలపై కూడా కేంద్రాన్ని నిలదీస్తూ, సామాన్యుడిపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో గ్యాస్ పంపిణీని పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించే యోచనలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ూశ్రీంశీ =ఘుం - ద్వారకా తిరుమలలో గ్యాస్ కష్టాలు.. కట్టెల పొయ్యిపైనే స్వామివారి నిత్య అన్నదానం! ఆంధ్రప్రదేశ్ వ్యూహం.. ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని చాలా వ్యూహాత్మకంగా ఎదుర్కొంటోంది. తమ రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. వదంతులను నమ్మి ప్రజలు కంగారు పడవద్దని, ప్రతి ఒక్కరికీ రెండు రోజుల్లోనే సిలిండర్ డెలివరీ చేసేలా ఏర్పాట్లు చేశామని స్పష్టం చేసింది. పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా ఉండటానికి ఎల్ఓసీఎల్ హెచ్ పీసీఎల్ బీపీసీఎల్ డైరెక్టర్లతో ఒక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. అత్యవసర రంగాలకు (ఆసుపత్రులు, ముఖ్యమైన సంస్థలు) మొదటి ప్రాధాన్యతిస్తూ, గృహ అవసరాలకు ఢోకా లేకుండా చూడాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాజకీయంగా విమర్శలు ఎలా ఉన్నా, వాస్తవానికి గ్యాస్ ధరలు, సరఫరాలో ఉన్న షరతులు రాష్ట్రాలకు తలనొప్పిగా మారాయి. కేంద్రం సరఫరా పెంచాలని రాష్ట్రాలు కోరుతుంటే, నిల్వలను సక్రమంగా నిర్వహించాలని కేంద్రం సూచిస్తోంది. మధ్యలో సామాన్య ప్రజలు మాత్రం బుకింగ్స్ పెండింగ్‌లో ఉండడం చూసి ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద అక్రమ నిల్వలు పెరగడం, కమర్షియల్ సిలిండర్ల కోసం డొమెస్టిక్ గ్యాస్ ను వాడటం వంటివి ఈ సంక్షోభాన్ని మరింత పెంచుతున్నాయి. వంట గ్యాస్ అనేది రాజకీయం చేసే వస్తువు కాదు.. అది ప్రతి ఇంటి అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర ఆరోపణలు పక్కన పెట్టి, సమన్వయంతో పని చేయాల్సిన సమయం ఇది. అక్రమ రవాణాను అడ్డుకోవడానికి రాష్ట్రాలు కఠినంగా వ్యవహరించాలి, అదే సమయంలో సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా కేంద్రం చూడాలి. ప్రజలు కూడా అనవసరంగా భయపడి భారీగా బుకింగ్స్ చేయకుండా, తమ అవసరానికి తగ్గట్టుగా వ్యవహరిస్తే ఈ కృత్రిమ కొరతను అధిగమించవచ్చు. మరి ఈ గ్యాస్ మంటలు ఎప్పుడు చల్లారుతాయో వేచి చూడాలి!

## స్పెషల్ కలెక్షన్ డ్రైవ్ లో 250 కేజీల సింగల్ యూస్ ప్లాస్టిక్ సేకరణ



**విజయవాడ పశ్చిమ మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం శ్రీ కనకదుర్గమ్మ దేవాలయం వద్ద సింగిల్ యూస్ ప్లాస్టిక్ కలెక్షన్ డ్రైవ్ ను కోకో కోలా బేవరేజెస్ సంయుక్త ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కె. షమ్మీ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధాన్ని విస్తృతంగా ప్రజలు అవగాహన కల్పించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నామని అందులో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ కనకదుర్గమ్మ దేవాలయం వద్ద ఒకసారి తాగి పడేసిన శీతల పానీయాల బాటిల్లను సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. అందులో భాగంగా 250 కిలోల ప్లాస్టిక్ ను సేకరించరాని అన్నారు. ఈ కార్యక్రమంలో కోకోకోలా బెవరైజెస్ నేషనల్ హెడ్ తుషారంజన్ పట్నాయక్, సంస్థ ప్రతిష్టానం ఎన్జీవో సభ్యులు, శానిటరీ సూపర్వైజర్ సోమిరాజు, పాల్గొన్నారు.



## వస్త్రలత వ్యాపారస్తులు అద్దె బకాయిలను మార్చి 22లోపు చెల్లించాలి





**విజయవాడ పశ్చిమ మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలోని వస్త్రలత కాంప్లెక్స్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారస్తులందరూ కార్పొరేషన్‌కు చెల్లించవలసిన నెలవారీ అద్దె బకాయిలు మరియు మొండి బకాయిలను మార్చి 22, 2026 లోపు తప్పనిసరిగా చెల్లించాలని విజయవాడ నగరపాలక సంస్థ ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ ఎ. శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఉదయం విజయవాడలోని ఐవి ప్యాలెస్ వద్ద వస్త్రలత కాంప్లెక్స్ వ్యాపారస్తులు మరియు అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్‌కు సంబంధించిన మరుగుదొడ్ల మరమ్మతులు, పరిశుభ్రత నిర్వహణ, లిఫ్ట్ సౌకర్యం వంటి అంశాలపై చర్చించారు. మార్చి నెల ముగియడానికి కొద్ది రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో, కాంప్లెక్స్‌లోని లీజుదారులు కార్పొరేషన్‌కు చెల్లించవలసిన అద్దె బకాయిలను నిర్ణీత గడువు అయిన మార్చి 22, 2026 లోపు తప్పనిసరిగా చెల్లించాలని ఎస్టేట్ ఆఫీసర్ సూచించారు. గడువు లోపు బకాయిలను చెల్లించని పక్షంలో, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్ టి. నాగేశ్వరరావు, వస్త్రలత అసోసియేషన్ సభ్యులు జగన్, నాగేశ్వరరావు, ఎస్టేట్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## మొల్లమాంబ జయంతి సందర్భంగా ఘన నివాళులు





**విజయవాడ పశ్చిమ మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్థానం సంపాదించిన కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా, శుక్రవారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, తెలుగు భాషా సాహిత్యానికి మొల్లమాంబ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. మహిళలలో ఉన్న ప్రతిభను సమాజానికి పరిచయం చేసిన గొప్ప కవయిత్రిగా మొల్లమాంబ నిలిచారని తెలిపారు. మొల్లమాంబ రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యానికి అమూల్యమైన సంపదగా నిలిచిందని అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మొల్లమాంబ సాహిత్యాన్ని అధ్యయనం చేసి, తెలుగు భాషా సౌందర్యాన్ని తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, మొల్లమాంబ తెలుగు సాహిత్యంలో మహిళల పాత్రను ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టిన మహనీయురాలని కొనియాడారు. మొల్లమాంబ జీవిత చరిత్ర మరియు సాహిత్య సంపద నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి మొల్లమాంబ చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఏ రవీంద్రరావు, చక్రవర్తి, ఎకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) ఎం విజయలక్ష్మి, సూపరింటెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ గోపాల నాయక్, డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొని మొల్లమాంబకు నివాళులు అర్పించారు.

## పిల్లల్ని కనే స్వేచ్ఛ మహిళలదే..

- సంతానోత్పత్తిని పెంచాలనే ప్రకటనను సీఎం వెనక్కు తీసుకోవాలి
- మహిళా సమాఖ్య రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్



**విజయవాడ పశ్చిమ మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తమ గౌరవానికి భంగం కలగకుండా పిల్లల్ని కనే స్వేచ్ఛ మహిళలకే ఉంటుందని సంతానోత్పత్తిని పెంచటానికి ఏప్రిల్ నుంచి చంద్రబాబు ప్రభుత్వం తీసుకురానున్న జనాభా నిర్వహణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు." ఒక్కరు వద్దు-ముగ్గురు ముద్దు పథకం లాభామా? నష్టమా" అంశంపై ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక దాసరి భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ మహిళల హక్కులన్నీ మానవ హక్కులే అన్నారు. పిల్లల బాధ్యత తల్లిదండ్రులదని, వారు లేనిపక్షంలో సమాజంపై బాధ్యత ఉంటుందన్నారు. 1970లలో జనాభా నియంత్రణ తీసుకురాగా దేశంలోని దక్షిణాది రాష్ట్రాలు ఆచరించాయన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీ స్థానాలు తగ్గకుండా చేయాలనే రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు ఈ ప్రకటన చేశారని చెప్పారు. మహిళలు, పిల్లలు ఎంత ఆరోగ్యంగా ఉన్నారు, ఎంత మంది పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుంది, ఎంత మంది సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు, ఎంత మంది పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉంది, ఎంత మంది మహిళలు, చిన్నారులు అత్యాచారానికి గురౌతున్నారు. వంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండా ముఖ్యమంత్రి నిర్ణయాలు ప్రకటించటం బాధ్యతారహిత్యమని విమర్శించారు. గ్రామాల్లో 70 శాతం మంది మహిళలు రక్తహీనతతోబాధపడుతున్నారని, 32 శాతం పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారని తెలిపారు. ఐవీఎఫ్ కేంద్రాల్లో సఫల్యత ఎంత శాతం ఉందో తెలుసుకోవాలన్నారు. వైద్య సదుపాయాలు కల్పించకుండా, రక్షణ చర్యలు తీసుకోకుండా సంతానోత్పత్తి పెంచాలనే నిర్ణయాన్ని ఎలా అందిపుచ్చుకుంటారని ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎక్కువ పన్నులు కట్టటం జరుగుతుందన్నారు. ఎంపీ సీట్లు పెంచకోవటానికి పిల్లల్ని కనటం కాకుండా వేరే అంశాలను పరిగణలోకి తీసుకుని నియోజకవర్గాల పునర్విభజన చేయాలని సూచించారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని మాట్లాడుతూ పిల్లల్ని కనండి, పోషించండి అని చంద్రబాబు చెప్పటంతో పిల్లల్ని కనే యంత్రాలుగా మహిళల్ని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందనే అభిప్రాయానికి ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తుందన్నారు. 70వేల కోట్ల రూపాయల లోటుతో రాష్ట్ర బడ్జెట్‌ని చూపించిన ప్రభుత్వం జనాభా నిర్వహణ పథకానికి డబ్బులు ఎక్కడ నుంచి తీసుకువస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్రంలో యువత ఉద్యోగాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా జనాభా నిర్వహణ పథకాన్ని తీసుకురావటం సరికాదన్నారు. జనాభా నిర్వహణపై ప్రభుత్వ నిర్ణయాన్ని మహిళా సమాఖ్య ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు పోరాడతామని చెప్పారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ పిల్లల్ని కనే సందర్భంలో మహిళలు 95శాతం మంది సిజేరియన్ చేయించుకోవాల్ని వస్తుందని, కొన్ని సందర్భాల్లో గర్భసంచి తొలగించాల్సి వస్తుందన్నారు. తద్వారా కొంత కాలానికి వారు తీవ్ర ఆనారోగ్యానికి గురౌతున్నారని తెలిపారు. మాత, శిశుమరణాలు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయన్నారు. 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామం వంటి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి కొత్త నిర్ణయాలు ముందుకు తీసుకురావటం సరికాదని హితవు పలికారు. జనాభా పెంచాలనే చంద్రబాబు నిర్ణయం వెనుక ప్రపంచబ్యాంకు, మోదీ ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్నారు. సామాజిక ఉద్యమకారిణి డాక్టర్ వసుంధర మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధాల వల్ల తగ్గుతున్న జనాభాని మనమే భర్తీ చేయాలని, అన్ని నేనే ప్రారంభించాను అనే అత్యుత్సాహంతో చంద్రబాబు ఈ ప్రకటన చేశారని పేర్కొన్నారు. అడ్వొకేట్ రజని మాట్లాడుతూ ఎక్కువ మంది మగవారు కల్తీమద్యంతో సేవించి చనిపోతున్నారని, ఆ కుటుంబ భారం మహిళలపైనే ఉంటుందన్నారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లతో మహిళల ఆరోగ్యం క్షీణిస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల్ని కనటం కష్టంగా ఉంటుందన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు పి.పద్మ, మాట్లాడుతూ జనాభా పెంచడం కంటే ముందు పాలకులు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లో చిత్తశుద్ధి చూపించాలన్నారు.. స్త్రీ విముక్తి సంఘటన నాయకులు చల్లపల్లి విజయ, శ్రీదేవి చైతన్య మహిళా సంఘం నాయకులు లక్ష్మీ, ఐద్వా నాయకులు కె.శ్రీదేవి, మహిళా సమాఖ్య నాయకులు పద్మావతి, మన్నవ యామిని,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వరరావు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగంధర్ , పీడీఎస్యు నుండి రాజేష్ , కెవిపిఎస్ నుండి అరుణ, మహిళావైసీపీ నుండి విజయలక్ష్మి వితదితరులు పిల్లల్ని కనటం, వారిని పోషించటం అనేవి ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని, ప్రభుత్వాలు జోక్యం చేసుకోవటం మంచికాదని వివరిస్తూ ప్రసంగించారు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్యఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పంచదార్ల దుర్గాంబ వందన సమర్పణ చేశారు.

## కాచవరం పాఠశాలలో విద్యార్థులకు ముస్తాబు కిట్ల పంపిణీ



**ఇబ్రహీంపట్నం, మార్చి 13(వార్తా ప్రభ ప్రతినిధి):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని పాఠశాలలో అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా మండల పరిధిలోని కాచవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముస్తాబు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు, ఉర్దూ ఉపాధ్యాయుడు మహమ్మద్ ఇర్ఫాన్ పాషా విజ్ఞప్తితో గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ ఎలీషా సుమారు రూ.7,000 విలువైన ముస్తాబు కిట్లను అందజేశారు. ఈ కిట్ లో డ్రెస్సింగ్ టేబుల్ అద్దం, నెయిల్ కట్టర్,కొబ్బరి నూనె,పౌడర్, బాలికలకు రిబ్బన్లు, నాప్కిన్లు, దువ్వెనలు, సబ్బులు, గ్రీన్ మ్యాట్స్ తదితర వస్తువులు ఉన్నాయి. విద్యార్థులు డాక్టర్ ఎలీషా కు కృతజ్ఞతలు తెలిపారు.

## చెరుకుపల్లి లో రచయిత్రి మొల్ల కి ఘన నివాళులు




**చెరుకుపల్లి మండలం మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బాపట్ల జిల్లా చెరుకుపల్లి లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రచయిత్రి మొల్ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మట్టిలో మాణిక్యం కుమ్మరి సమాజంలో జన్మించి సరళీకృత తెలుగు భాషను రామాయణం రచించిన కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ నాయకులు పొన్నపల్లి సత్యనారాయణ, దామర్ల చంద్ర బాబు, పెనుమత్స గౌతం, దామర్ల సత్యవతి, వడత శ్రీలక్ష్మి, ఆత్మూరి పవను తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడే ను డ్రై డే గా పాటించాలి





**విజయవాడ పశ్చిమ మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడే ను డ్రై డే గా పాటించాలని విజయవాడ నగర పాలక సంస్థ బయాలజిస్ట్ వి కామేశ్వరరావు ప్రజలతో అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం కృష్ణలంక ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు వీఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే, డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు ,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయోలజీస్ట్ కామేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా ఇన్స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్స్, మలేరియా సిబ్బంది, యూ ప్ హ సీ, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## తెలుగు కవయిత్రి మొల్లమాంబ కి పోలీసుల ఘన నివాళులు



**విజయవాడ పశ్చిమ మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి అడ్మిన్ డి.సి.పి. శ్రీమతి కే.జి.వి.సరిత నివాళులు అర్పించారు. తెలుగు కవయిత్రి, రామాయణ మహా గ్రంథ తెలుగు అనువాది, స్త్రీల పట్ల సమాజంలో ఉన్న వివక్షను చేదించుకొని వెలుగు చూసిన నారీమణి కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా శుక్రవారం పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు పోలీస్ కమీషనర్ వారి కార్యాలయం నందు అడ్మిన్ డి.సి.పి. శ్రీమతి కే.జి.వి.సరిత ఐ.పి.ఎస్. మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అడ్మిన్ డి.సి.పి. మాట్లాడుతూ..... 16వ శతాబ్దంలో స్త్రీలు, అణగారిన కులాల పట్ల సమాజంలో ఉన్న వివక్షను ఛేదించుకొని వెలుగు చూసిన నారీమణి మరియు తెలుగు మొదటి కవయిత్రి మొల్ల తన కవితా కళతో అందరికి ఆదర్శంగా నిలిచిందని, ఆమె జీవించిన కాలంలో వర్ణ దురహంకారన్నీ ఎదుర్కొని తనని తాను నిరూపించుకున్న సాహసి అని, స్త్రీలు వంటింటికే పరిమితం అనే ఆ రోజుల్లో తన రచనలతో సామాజిక స్పృహ కొరకు పాటు పడిందని, ఎక్కడ స్త్రీలకు అన్యాయం జరిగినా అక్కడ వారి కోసం ధైర్యంగా పోరాడిందని, మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కొరకు పలురకాలుగా కృషి చేసిందని, ఆమె చివరి శ్వాస వరకు తన రచనలతో సమాజ అభ్యుదయం కొరకు పాటుపడిందని కొనియాడారు. తెలుగు సాహితీ సరస్వతికి మొల్ల అందించిన "మొల్ల రామాయణము" కంఠ ఆభరణం వంటిదని, కవితను పరిమితితో అల్లగల ప్రతిభాశాలైన ఆమె తన సరళ రమణీయమైన రచనా శైలి వలన సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువాదించిన ఆమె "మొల్ల రామాయణం" విద్యాలయాలలో పాఠ్యాంశం అయ్యిందని పేర్కొన్నారు.

## శ్రీ త్రికోటేశ్వర లో ఘనంగా ఫేర్వెల్ పార్టీ వేడుకలు



**చేజర్ల మార్చి 13 (వార్తాప్రభ)** మండలంలోని ఆదురుపల్లిలో ఉన్న శ్రీ త్రికోటేశ్వర విద్యాలయం లో సరస్వతీ పూజ మరియు ఫేర్వెల్ పార్టీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతి పూజ అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ సుధాకర్ రెడ్డి పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీ నరసారెడ్డి సుప్రియ ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు హాల్ టికెట్స్ మరియు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేసి వారి జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆశీర్వదించారు. తదుపరి విద్యార్థినీ విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో జీఎస్టీ కీలకం









విజయవాడ పశ్చిమ, మార్చి 13:(వార్తా ప్రభ ప్రతినిధి)జీఎస్టీ అమలు ఫలితంగా దేశంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, తద్వారా దేశాభివృద్ధిలో జీఎస్టీ కీలకపాత్ర పోషిస్తోందని కస్టమ్స్ అండ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అసిస్టెంట్ కమిషనర్ అతిర ఎస్.కుమార్ అన్నారు. ఐ.సి.ఎస్.ఎస్. ఆర్ సహకారంతో కె.బి.ఎన్.కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం 'జీఎస్టీ సంస్కరణలు -- వాటి ఆర్థిక, సామాజిక ప్రభావాలు' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అతిర మాట్లాడుతూ 2017లో అమల్లోకి వచ్చిన ఈ పన్ను విధానం భారతదేశంలో ఉన్న అనేక పరోక్ష పన్నులను ఒకే వ్యవస్థలోకి తీసుకువచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానాన్ని అమలు చేసి వ్యాపారాన్ని సులభతరం చేయడం, పారదర్శకత పెంచడం, ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడం ఈవిధానం ప్రధాన లక్ష్యాలుగా చెప్పారు. ఒకే దేశం -- ఒకే పన్ను అనే భావనతో ఈ వ్యవస్థ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఎ.పి.హెచ్.ఆర్. ఇ. సి ముఖ్య నిర్వహణాధికారి ప్రొఫెసర్ డి. సూర్యచంద్రరావు మాట్లాడుతూ జీఎస్టీ 2.0 విధానం వల్ల కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రెండు రోజుల పాటు జరిగిన వివిధ సదస్సుల్లో కృష్ణా యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ జయశంకర ప్రసాద్, విజ్ఞాన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ అక్షయ్ జైన్ తదితరులు పాల్గొని జీఎస్టీ సంస్కరణల్లోని వివిధ కోణాలను ఆవిష్కరిస్తూ ప్రసంగించారు. సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రాల సంకలనాన్ని అదితి ఆవిష్కరించారు. హిందూ హై స్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, పీజీ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేశ్, సెమినార్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 16వ తేదీ నుండి హాఫ్ డే స్కూల్స్

**కృష్ణాజిల్లా డిఇఓ యు వి సుబ్బారావు.**



**మచిలీపట్నం మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈనెల 16వ తేదీ అనగా సోమవారం నుండి అన్ని యాజమాన్యాలలోని పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించడం జరుగుతుందని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు ఉత్తర్వులు జారీ చేసినట్లు కృష్ణాజిల్లా డిఇఓ యువి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలియజేశారు.పదవ తరగతి పరీక్షా కేంద్రాలుగా లేని పాఠశాలలు ఉదయం పూట, పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం నుండి పనిచేయాలని తెలియజేసారు. ఒంటిపూట బడులు ఉదయం 8 గంటల నుండి 12:30 గంటల వరకు కొనసాగుతాయ న్నారు. మధ్యాహ్నం భోజనము మధ్యాహ్నం 12:30 తర్వాత ఏర్పాటు చేయవలెనని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు.

## ఘనంగా మొల్లమాంబ జయంతి.

**యువతకు, విద్యార్థులకు కవయిత్రి మొల్ల మాంబ జీవితం ఆదర్శం డిఆర్ఓ.**



**మచిలీపట్నం మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శుక్రవారం కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ మీటింగ్ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్ల చిత్రపటానికి డిఆర్ఓ కె.చంద్రశేఖర రావు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కవయిత్రి మొల్ల మాంబ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత విద్యార్థినీ విద్యార్థులు స్ఫూర్తి పొందాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మొల్ల జయంతిని అధికారంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. రామాయణాన్ని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా తక్కువ వ్యవధిలో రచించిన మొల్ల గొప్ప కవయిత్రని కొనియాడారు.

## పేట ఎంపీడీఓ కార్యాలయంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం



**అనుమసముద్రంపేట మార్చి 13 (వార్తాప్రభ)** ఏఎస్పేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శు క్రవారం నిర్వహించారు.మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పి ప్రసన్న కుమారి మండల ఉప తహసీల్దార్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు అందజేశారు. జనగణన 2027కు సంబంధించి ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు.గ్రామ రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఈ మేరకు జన గణన 2027కు సంబంధించి ఫేస్ 1 హౌస్ లిస్టింగు మే 1 నుంచి 30 వరకు గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు మరియు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పేదవాడి ఆకలి తెలుసుకోవడమే రంజాన్ విశిష్టత- కోగంటి సత్యం

**పేద ముస్లింలకు హజ్రత్ సయ్యద్ షాబుఖారి ఆస్థానలో రంజాన్ తోఫా పంపిణీ చేసిన కోగంటి సత్యం**





**ఇబ్రహీంపట్నం, మార్చి 13(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి లోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి ఆస్థానలో రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యం సౌజన్యంతో ఆస్థాన పీఠాధిపతి అల్తాఫ్ బాబా ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం తోఫా పంపిణీ ప్రారంభించారు.ఈ సందర్భంగా కోగంటి సత్యం మాట్లాడుతూ సమానత్వం ఐక్యత రంజాన్ యొక్క ప్రత్యేకత అని అన్నారు. తమకు ఉన్న దాంట్లో సాటివారికి సహాయపడుతూ... వారికి కష్టాలలో అండగా నిలవడం ఎంతో ఆత్మ సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా తోఫా పంపిణీ చేయడం సంతోషకరమని అన్నారు. ప్రస్తుతానికి ఎన్నికల్లో పోటీచేసే ఆలోచన లేదన్నారు. సేవ మార్గంలో మాత్రమే ప్రయాణం చేస్తున్నానని చెప్పారు.అల్తాఫ్ బాబా మాట్లాడుతూ నిస్వార్థంతో సేవా కార్యక్రమాలకు చేస్తూ అండగా నిలవటం కోగంటి సత్యం ప్రత్యేకత అన్నారు. ఎలాంటి స్వార్థం, లాభాపేక్ష లేకుండా ఎప్పుడు ఆయన సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమన్నారు. ఆ అల్లా ఆయనకు పూర్తి ఆయురారోగ్యాలు యోగక్షేమాలు ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. సత్యం ను ఇస్లాం సాంప్రదాయం ప్రకారం సన్మానించారు. తోఫా పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు అల్తాఫ్ బాబా భోజనం ఏర్పాటు చేశారు. స్వయంగా మహిళలకు అన్నని వడ్డించారు కోగంటి సత్యం.

## కొండపల్లి లో డ్రగ్స్ కలకలం

**200 కిలోల అల్పరాజోలుమ్ స్వాధీనం**
**డీఆర్ఐ అధికారుల ఆకస్మిక తనిఖీలు**



**ఇబ్రహీంపట్నం, మార్చి 13(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో అక్రమంగా నడుస్తున్న భారీ మాదక ఔషధ తయారీ కేంద్రాన్ని అధికారులు వెలికితీశారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన దర్యాప్తు సంస్థ డైరెక్టరేట్ అఫ్ రెవిన్యూ ఇంటలిజెన్స్ (డీఆర్ఐ) నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సుమారు 200 కిలోల అల్పరాజోలుమ్ స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఈ మాదక పదార్థం విలువ సుమారు రూ.47 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. డీఆర్ఐ అధికారుల సమాచారం మేరకు కొండపల్లి పరిశ్రమల ప్రాంతంలో ఎం ఎస్ రాస్ ఆర్గానిక్స్ పేరిట రహస్యంగా మాదక ఔషధ తయారీ జరుగుతున్నట్లు గోప్య సమాచారంతో గుర్తించారు. అనంతరం నిర్వహించిన దాడుల్లో భారీ పరిమాణంలో రసాయనాలు, యంత్రాంగం బయటపడింది.

**భారీగా కెమికల్స్, యంత్రాలు స్వాధీనం..**కొండపల్లిలో జరిగిన దాడుల సమయంలో అధికారులు 2860 లీటర్ల వివిధ రకాల కెమికల్స్, 800 కిలోల రా సబ్స్టెన్స్, అలాగే డ్రగ్ తయారీకి వినియోగించే రియాక్టర్లు, డ్రైయర్లు, సెంట్రిఫ్యూజ్‌లు వంటి పరిశ్రమల యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన పదార్థాల పరిమాణాన్ని బట్టి కొంతకాలంగా ఇక్కడ భారీ స్థాయిలో ఉత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

**ఇద్దరు నిందితులు అదుపులో**ఈ కేసులో హైదరాబాద్ బొల్లారానికి చెందిన కనుమూరి సాయి త్రిభువన్ వర్మ, సౌరబ్ కుమార్లను డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరు ఫార్మా రంగానికి చెందిన అనుభవాన్ని ఉపయోగించి అక్రమంగా ఆల్ప్రజోలాం తయారీ నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. స్వాధీనం చేసిన కెమికల్స్, యంత్రాల పరిమాణం చూస్తే పెద్ద స్థాయి నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఈ ఘటనతో కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో అక్రమ రసాయన తయారీ కేంద్రాలపై నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు నిర్ణయించారు. కేసుపై డైరెక్టరేట్ అఫ్ రెవిన్యూ ఇంటలిజెన్స్ అధికారులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**2 సంవత్సరాలలో బీరోలు గ్రామ అభివృద్ధికి 29 కోట్ల 92 లక్షలు మంజూరు**
**తిరుమలాయపాలెం మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి**

**ఖమ్మం , మార్చి 13: (వార్తా ప్రభ ప్రతినిధి)::** పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శుక్రవారం తిరుమలాయపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.బీరోలులో 2 కోట్ల 59 లక్షలతో బీరోలు నుండి ఏలువారిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 64 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, బంధంపల్లిలో 5 కోట్ల 50 లక్షలతో దమ్మాయిగూడెం నుండి సోలిపురం రోడ్డు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా బీరోలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ఆత్మ గౌరవంగా జీవించేలా చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డులు, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి అనేక కార్యక్రమాలు అమలు చేసిందని అన్నారు. 2 కోట్ల 59 లక్షలతో బీరోలు నుండి ఏలువారి గూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు, 64 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రోడ్లు, బంధంపల్లిలో 5 కోట్ల 50 లక్షలతో దమ్మాయి గూడెం నుండి సోలిపురం రోడ్డు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నట్లు మంత్రి తెలిపారు. బంధం పల్లి నుండి అస్నాబాద్ వరకు 4 కోట్ల 5 లక్షల రూపాయలతో చేపట్టిన తారు రోడ్డు, కట్టెల పాడు నుంచి బీరోలు వరకు 6 కోట్ల 50 లక్షలతో తారు రోడ్డు, చౌటుపల్లి బీరోలు రోడ్డుకు 3 కోట్ల 20 లక్షల కల్వర్టు నిర్మాణం, కూసుమంచి బీరోలు రోడ్డుకు 2 కోట్లతో కల్వర్టు నిర్మాణం, బీరోలు నుంచి మేడేపల్లికి కోటి 87 లక్షలతో తారు రోడ్డు, బీరోలు నుంచి మేడేపల్లి రోడ్డు సిడీ పనులకు 30 లక్షల రూపాయలు, బీరోలు పెద్ద చెరువు మరమ్మత్తుకు 2 కోట్ల 25 లక్షలు, 80 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు, 15 లక్షలతో అంగన్వాడి భవనం, 6 లక్షల రూపాయలతో త్రాగునీటి సరఫరా పనులు పూర్తి చేశామని, బీరోలు గ్రామానికి ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాల మూడు నెలల్లో 29 కోట్ల 92 లక్షలు ఖర్చు చేసిందని అన్నారు.రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని, పేదలకు అందించే సంక్షేమ కార్యక్రమాలు, రైతును రాజును చేసేందుకు తీసుకుంటున్న చర్యలు, మహిళలు ఆత్మ గౌరవంతో జీవించేలా పలు కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. నిరుద్యోగ యువత కు గతంలో ఎన్నడూ లేని విధంగా 72 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. సాగునీరు, త్రాగునీటి సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వం భవిష్యత్తులో పేదలకు మరింత అండగా ఉంటుందని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బీరోలు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.


## లుంబిని విద్యాలయం లో ఘనంగా సరస్వతీ పూజ





**చేజర్ల మార్చి 13 (వార్తాప్రభ)** చేజర్ల మండలములోని లుంబిని విద్యాలయం నందు పాఠశాల కరెస్పాండెంట్ మరియు డైరెక్టర్ రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సరస్వతిదేవి పూజ వేడుకలు నిర్వహించారు.పదవ తరగతి పరీక్షలు 16వ తేదీ నుండి ప్రారంభం కానున్న నేపధ్యంలో విద్యార్థిని విద్యార్థులకు సరస్వతి అమ్మ వారి కరుణ కటాక్షాలు కలగాలని సరస్వతీ దేవి పూజ కార్యక్రమాలు నిర్వహించామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు పాల్గొని తాము పరీక్షలు బాగా రాసేలా ఆశీర్వదించాలని సరస్వతి అమ్మ వారికి మొక్కు కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏకదశ వార్షిక వైభోత్సవాలు.



**మచిలీపట్నం మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక శ్రీ చిట్టి పిళ్ళారయ్య స్వామి వారి దేవస్థానం బుట్టాయిపేట నందు శ్రీ వల్లభాంబ సమేత మహాగణపతి పంచయతన క్షేత్రము నందు ఏకా దశవార్షిక వైభో వోత్సవములు ఘనంగా నిర్వహిస్తున్నారు.దీనిలో భాగంగా బుధవారం గణపతి పూజ, బాల త్రిపుర సుందరి అమ్మవారి అభిషేకం, అర్చన సువాసినీలచే లలిత సహస్రనామ పారాయణం, కుమారి పూజ, సువాసిని పూజ, చండి హోమము తిలకించడానికి అశేష సంఖ్యలో భక్తులు దేవాలయానికి విచ్చేశారు. ఘనా పాటి విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వశాంతి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదివారం వరకు జరిగే కార్యక్రమాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని సేవకులు మాదిరెడ్డి అంజిబాబు తెలిపారు.

## గ్యాస్ కొరత

**తీవ్ర కొరతతో హోటళ్లకు ఇబ్బందులు.**
**కట్టెల పొయ్యే ఆధారం.**



**మచిలీపట్నం మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇరాన్ యుద్ధ ప్రభావం వల్ల నగరంలో గ్యాస్ కు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ గోడౌన్స్ లో ఎక్కడ చూసినా నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య అవసరాలకు సంబంధించి గ్యాస్ సిలిండర్లకు తీవ్ర కొరత వేధించడం వల్ల హోటల్ నిర్వాహకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చాలా రెస్టారెంట్లు ఇప్పటికే కట్టెలపై ఆధారపడుతున్నాయి. నగరంలో కట్టెలకు కూడా కొరత ఏర్పడింది. దొరికే ఆమాత్రం కట్టెలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ సరఫరాలో ఏర్పడిన కొరత రెస్టారెంట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. హోటళ్లలో వేడి వేడి పదార్థాలు తయారు చేసేందుకు అవసరమైన కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో యాజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.గ్యాస్ కొరత కారణంగా నగరంలోని అనేక హోటళ్లు, చిన్న చిన్న రెస్టారెంట్లు కట్టెల పొయ్యిలను వినియోగిస్తూ వంట పనులను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా గ్యాస్ స్టౌవ్‌లపై వేగంగా తయారయ్యే వంటకాలు ఇప్పుడు కట్టెల పొయ్యిలపై ఎక్కువ సమయం తీసుకుంటుండటంతో హోటల్ నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ సరఫరాలో అంతరాయం వల్ల వ్యాపారంపై ప్రభావం పడుతుందని హోటల్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కట్టెల పొయ్యిల వినియోగం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు పని భారమూ పెరుగుతోందని వారు చెబుతున్నారు.ఇప్పటికైనా గ్యాస్ సరఫరా పరిస్థితి సాధారణ స్థితికి రావాలని, లేకపోతే హోటల్ వ్యాపారంలో మరింత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



అఖిల భారత యాదవ మహాసభ జాతీయ జనరల్ సెక్రటరీ మరియూ దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త బత్తుల జగదీష్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సంఘ రాష్ట్ర అధ్యక్షులు చింకా నారాయణరావు యాదవ్, జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్,ఉపాధ్యక్షులు తోకల రామకృష్ణ యాదవ్, యూత్ అధ్యక్షులు ఆలా అనంతరామయ్య యాదవ్, జనరల్ సెక్రటరీ దుగ్గని సూర్య యాదవ్ తదితరులు **-వార్త ప్రభ విజయవాడ**

## మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా “ఈద్ ఖా తోఫా” పంపిణీ



**శేరిలింగంపల్లి,మార్చి 13 (వార్తాప్రభ):**చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట గ్రామంలో మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని “ఈద్ కా తోఫా” పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి హాజరై అవసరమైన కుటుంబాలకు ఈద్ కా తోఫా కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంజుల రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ పండుగ పరస్పర ప్రేమ,త్యాగం,సమానత్వానికి ప్రతీక అని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అందిస్తున్న ఈద్ కా తోఫా పథకం ద్వారా పేద మరియు అవసరమైన ముస్లిం కుటుంబాలకు పండుగ సమయంలో ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ గౌడ్, రవీందర్ రావు,అక్బర్ ఖాన్, యూసుఫ్ అలీ,మస్జిద్ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి శుభాకాంక్షలు



**శేరిలింగంపల్లి,మార్చి 13 (వార్తాప్రభ):**చందానగర్ డివిజన్ పరిధిలోని భావనిపురం వీకర్ సెక్షన్ బస్తీలో ఉన్న మజీద్ ఏ గౌసియా మజీద్ మరియు వేముకుంట బస్తీలోని మోహమ్మదీయా మజీద్ వద్ద రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు.బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో రెండు బస్తీలకు చెందిన ముస్లిం మైనారిటీ సోదరులు,సోదరీమణుల కోసం ప్రత్యేకంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ముస్లిం కుటుంబాలు పాల్గొని ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మొయినుద్దీన్, అల్తాఫ్,అఖిల్,శభనా, బాబా, ప్రకాష్,గౌస్,ప్రమోద్,అంజి, శేఖర్,మల్లేష్ యాదవ్,ఉపేందర్, బాలకృష్ణ యాదవ్, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసిస్టులకు వివిధ రకాల మందులపై అవగాహన సదస్సును నిర్వహించిన డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్

**దమ్మాయిగూడ, మార్చి13:(వార్తా ప్రభ)** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దమ్మాయిగూడ డివిజన్ పరిధి వెంకటరమణ కాలనీ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన మెడికల్ షాప్ నిర్వహిస్తున్న యజమానులకు ఫార్మసిస్టులకు వివిధ రకాల మందులపై అవగాహన సదస్సును నిర్వహించి, తప్పనిసరిగా హోల్ సేల్, రిటైల్ మందులు అమ్మగానే ఎవరెవరికి అమ్ముతున్నాం అనే విషయం మొత్తం కూడా రికార్డులో లేదా రిజిస్టర్ లో, కంప్యూటర్లో బిల్ నెంబర్, ఎప్పటికప్పుడు, హెచ్, హెచ్ 1, టి. బి మందులు, ఎక్స్ డ్రగ్స్ వివిధ షెడ్యూల్ గుర్తించి, చూసుకుంటూ ఎంటర్ చేయాలని ఏరియా డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ఫార్మసిస్టులకు క్లుప్తంగా అర్థమయ్యేలా తెలియజేశారు. అదేవిధంగా ఇష్టానుసారంగా యాంటిబయాటిక్స్ ను అమ్మ వద్దని, గడువు ముగిసిన మందులను ఎప్పటికప్పుడు వేరు చేయాలని, డాక్టర్ యొక్క ప్రిస్క్రిప్షన్ ఉంటేనే యాంటీబయటిక్స్ మందులను అమ్మాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టులు అందరూ కలిసి డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ను శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

## నేషనల్ హైవేపై భారీ వాహనాలను పార్కింగ్ చేసిన డ్రైవర్ల పై కేసు నమోదు



**జి.కొండూరు:మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నేషనల్ హైవేపై నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రమాదకరంగా వాహనాలు ఆపుతున్న నాలుగు హెవీ లారీలపై శుక్రవారం చేసినట్లు జి.కొండూరు పోలీసులు కేసులు నమో దు చేశారు.జి.కొండూరు శివ సాయి జంక్షన్, టీ షాప్ ల వద్ద హైవేపై అత్యంత ప్రమాదకరంగా నిలిపి ఉంచిన రెండు హెవీ లారీలను మరో రెండు కంటైనర్లు మొత్తం నాలుగు భారీ వాహనాలను మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు, జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నాలుగు భారీ వాహనాలను స్వాధీనం చేసుకుని సంబంధిత డ్రైవర్లపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేశారు.రూల్స్ ను ఉల్లంఘిస్తూ ప్రమాదకరంగా నేషనల్ హైవేపై వాహనాలు నిలిపే డ్రైవర్ల పైన మరియు ట్రాఫిక్‌కు వ్యతిరేక దిశలో ప్రయాణించే ఏ వాహనమైనా సరే కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.ఇటువంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు నష్టపోవద్దని వాహనదారులకు సూచించారు.రోడ్డు భద్రతను కాపాడే క్రమంలో వన్‌వే ఉల్లంఘనలు, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి చర్యలపై పోలీసులు ఇలాంటి కఠిన చర్యలు కొనసాగిస్తారని ప్రజలకు తెలియజేశా రు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిన ప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గాంధీ





**శేరిలింగంపల్లి,మార్చి 13 (వార్తాప్రభ):**చందానగర్ డివిజన్ పరిధిలోని చందానగర్‌లో ఉన్న అను ఫర్నిచర్ భవనం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన విషయం తెలిసిన వెంటనే పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ అను ఫర్నిచర్ భవనం పూర్తిగా దగ్ధం కావడం దురదృష్టకరమని తెలిపారు.ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోయినా భారీ ఆస్తి నష్టం సంభవించిందని పేర్కొన్నారు.ఎండకాలంలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని,అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా వాణిజ్య భవనాలు,వ్యాపారస్తులు అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. బాధితులు అధైర్యపడవద్దని,తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో అను ఫర్నిచర్ అధినేత రమణ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రఘుపతి రెడ్డి, రవీందర్ రావు, మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నరేందర్ బల్లా, యశవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రాజీవ్ గృహకల్పలో నీటి గోస: జలమండలి కార్యాలయం ముట్టడి

- నీటి సరఫరా పెంచాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసుల నిరసన.
- జగద్గిరిగుట్ట వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ధర్నా సంఘీభావం తెలిపిన కొలుకుల జగన్.
- మహిళల భారీ నిరసన..లిసమస్య పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరిక.



**జగద్గిరిగుట్ట, మార్చి 13, (వార్తాప్రభ)** : రాజీవ్ గృహకల్ప కాలనీలో నెలకొన్న తీవ్రమైన నీటి ఎద్దడిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు శనివారం జగద్గిరిగుట్టలోని జలమండలి (వాటర్ వర్క్స్) కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కాలనీకి అందుతున్న నీటి శాతాన్ని వెంటనే పెంచాలని, వేసవి దృష్ట్యా క్రమబద్ధమైన సరఫరా ఉండాలని వారు అధికారులను కోరారు. ఈ నిరసన కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ సంఘీభావం ప్రకటించి, కాలనీవాసులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై మహిళల ఆగ్రహం** నీరు రాక పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ రాజీవ్ గృహకల్ప మహిళలు ఖాళీ బిందెలతో తమ నిరసనను తెలియజేశారు. కాలనీ అధ్యక్షుడు ధర్మారపు అంజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ బిసు వెంకటస్వామి మాట్లాడుతూ.. జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా లేకపోవడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని మండిపడ్డారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతోనే రోడ్డెక్కాల్సి వచ్చిందని వారు స్పష్టం చేశారు.

**ప్రజా ప్రతినిధుల డిమాండ్** నీటి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరసనను ఉధృతం చేస్తామని నాయకులు అధికారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ వంగాల పరుశరామ్, రవి, కోశాధికారి ఎన్. నరసింహ రెడ్డి, ప్రచార కార్యదర్శి గణేష్, నాయకులు పాండు, ముస్తఫా, సత్తయ్య, పాండు నాయుడు, సునీల్ మరియు రాజీవ్ గృహకల్ప మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదు..

- వినియోగదారులు ఆందోళన చెందనవసరం లేదు
- వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరిక






**ఇబ్రహీంపట్నం, మార్చి 13(వార్తా ప్రభ ప్రతినిధి):** జిల్లాలో వంట గ్యాస్‌కు కొరత లేదని.. బాట్లింగ్, సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నించినా, బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు.కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్‌డీవోలు, పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) బాట్లింగ్ ప్లాంటును ఆకస్మికంగా సందర్శించారు. ప్లాంటు అధికారులతో సమావేశం నిర్వహించి ప్లాంటు కార్యకలాపాలను, ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో అవసరానికి సరిపడా ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు ఉన్నాయని, సరఫరా ప్రక్రియ కూడా సజావుగా కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చర్యలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో వంట గ్యాస్ కొరత ఉన్నట్లు కొన్ని అపోహలు వ్యాప్తి చెందుతున్నాయని, అలాంటి తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. గ్యాస్ సరఫరా విషయంలో ప్రస్తుతానికి ఎలాంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీలు, సరఫరా సంస్థలు వినియోగదారులకు సమయానికి సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వంట గ్యాస్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మనదగ్గర ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ మూడు బాట్లింగ్ ప్లాంటులు ఉన్నాయని.. రోజుకు లక్షల్లో బాట్లింగ్ చేసే సామర్థ్యం వీటికి ఉందన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాలో రోజుకు 16 వేల సిలిండర్లు అవసరం కాగా.. ఏ సమయంలోనైనా దాదాపు 25,500 సిలిండర్లు సిద్ధంగా ఉంటాయని వివరించారు. అందువల్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏజెన్సీలు కూడా అనవసరంగా ఎవరినీ ఆందోళనకు గురిచేయొద్దని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే క్రిమినల్ కేసులు కూడా పెట్టేందుకు వెనకాడబోమని స్పష్టం చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 9154970454కు కాల్ చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.కలెక్టర్ వెంట విజయవాడ ఆర్‌డీవో టీవీ సతీష్, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు తదితరులు ఉన్నారు.

# రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

- “రైతు బిడ్డ చంద్రన్న” పరిపాలన రైతు కుటుంబాలకు ఎంతో అండ
- గొల్ల నరసింహ యాదవ్
- పుంగనూరు లో పియంకిషాన్,రైతు భరోసా చెక్కులు పంపిణీ

చంద్రగిరి : **మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతు శ్రేయస్సు ధ్యేయంగా పనిచేస్తున్నాయని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి నరసింహ యాదవ్ అన్నారు.శుక్రవారం పీఎం కిసాన్22విడత,రైతు భరోసా మూడో విడత నిధులు విడుదల లో భాగంగా పుంగనూరు నియోజకవర్గ కేంద్రం యంపిడిఓ కార్యాలయం ఆవరణలో నరసింహ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని “పీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ” నియోజకవర్గం నిధులను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అస్సాం స్టేట్ లోని గౌహతి నుండి 22 వ విడత పి. యం కిసాన్ నిధులను,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 3వ విడత అన్నదాత సుఖీభవ నిధులను రైతుల అకౌంట్లకు విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమం పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్. సమీపతి ఆధ్వర్యంలో పుంగనూరు ఎంపీడీఓ ఆఫీస్ నందు ఏర్పాటు చేయడం జరిగింది.నరసింహ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఒక్కపుంగనూరు నియోజకవర్గానికి సంబంధించి 37,191మంది రైతులకు గాను రూ 21.23 కోట్ల మెగా చెక్ ను ముఖ్య అతిధి నరసింహ యాదవ్ చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. తదుపరి ప్రధానమంత్రి , రాష్ట్ర ముఖ్యమంత్రి నిధుల విడుదల కార్యక్రమం యొక్క ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులకు తిలకించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద 4 వేలు పీఎం కిసాన్ ద్వారా 2వేలు మొత్తం 6000 రూపాయలు రైతుల ఖాతాలో నేడు జమ అయిందన్నారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంవత్సరం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు 20వేల రూపాయలు వారి ఖాతాలో జమ చేసి రైతులను ఆదుకుంటున్నారని నర్సింగ్ యాదవ్ అన్నారు.అదేవిధంగా జిల్లాకు హంద్రీ– నీవా, ద్వారా నీళ్లు తెచ్చి రైతులకు సస్యశ్యామలంగా పంటలు పండే విధముగా కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలోని అన్ని చెరువులను హంద్రీ – నీవా కాలవ ద్వారా నీళ్ళునింపి రైతులకు సాగు,తాగు నీటి కొరత లేకుండా కూటమి ప్రభుత్వం చేస్తుందని అన్నారు.రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం రైతులకు వరగపెట్టింది ఏమీ లేదని గత ప్రభుత్వంలో 13వేలు ఇస్తే కూటమి ప్రభుత్వం 20 వేలకు చేసిందని ఆయన అన్నారు.రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా రైతుల కోసం అనేక సబ్సిడీ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నది అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సోమల-చావిజ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, కూటమి పార్టీ నాయకులు శ్రీకాంత్, సి.వి రెడ్డి , విరుపాక్షి , జగదీష్ రాజు,వెంకట్ రెడ్డి ,రామకృష్ణమరాజు , కవిత, అధికారులు ఎడిఎ శివకుమార్, ఎడిఎ (యస్ సి) శివప్రసాద్, పశు సంవర్ధక శాఖ ఎడి మనోహర్ ,పట్టు పరిశ్రమ శాఖ ఎయస్ఓ అరుణ, పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల వ్యవసాయ అధికారులు రాధ, మోహన్ కుమార్, సుధాకర్, జ్యోతమ్మ, లీలా కుమారి మరియు హార్టికల్చర్ ఆఫీసర్ వరప్రసాద్, వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర గ్రామీణ వైద్య సంక్షేమ సంఘం.



**మచిలీపట్నం మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (గవర్నమెంట్ హాస్పిటల్) సూపరింటెండెంట్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించినడాక్టర్ టి. లీల ప్రసాద్ ని రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిఆర్ ఆంజనేయులు సారధ్యంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు బి.ఆర్ ఆంజనేయులు, గౌరవాధ్యక్షులు ఎ .కోటీశ్వర రావు ప్రధాన కార్యదర్శి నందగోపాల్ జాయింట్ సెక్రెటరీ సందీప్ కుమార్ కోశాధికారి డేవిడ్ రాజు,జిల్లా కోశాధికారి వాసుదేవ మూర్తి,మండల అధ్యక్షులు శేషగిరి, మండల కోశాధికారి రత్తయ్య, కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు, విజయసాయి, అర్జున్ రావు, దుర్గారావు, రాజేష్ జవహర్, పెదన కార్యదర్శి సూరప రాజు తదితరులు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ను ఘనంగా సన్మానించారు.

## వైసిపి నాయకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.



**మచిలీపట్నం మార్చి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం రామానాయుడుపేట సెంటర్ లో జనసేన పార్టీ జెండా దిమ్మను నిర్మించడానికి జనసేన నాయకులు తలపెట్టిన కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు అడ్డుకున్నారు. జెండా నిర్మాణాన్ని వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితులలో రామానాయుడుపేట సెంటర్లో జనసేన పార్టీ జెండా నిర్మాణం చేస్తామని జనసేన పార్టీ నాయకులు తెలపటంతో వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున రామానాయుడు పేట సెంటర్ కు చేరుకున్నారు. జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు జెండా నిర్మాణ ప్రాంతం రామానాయుడుపేట కు చేరుకున్నారు. ఇరు పార్టీ నాయకులు కార్యకర్తలు రామానాయుడుపేట సెంటర్ కు చేరుకోవడంతో కాస్తంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇరు పార్టీ కార్యకర్తలు ఎవరికివారు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు రామానాయుడుపేట చేరుకొని ఇరు పార్టీ నాయకుల ఘర్షణను అడ్డుకున్నారు. వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులను పోలీసులు చెదరగొట్టడంతో ఉద్రిక్త వాతావరణంకు తెరపడింది. ఈ నేపథ్యంలో వైసిపి నాయకుడు బొర్రా విఠల్ ను పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో విఠల్ ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు బొర్రా విఠల్ ను గూడూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. వైసీపీ నాయకుడు పై కేసు నమోదు చేసిన పోలీసులు మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టనున్నారు.


## జవహర్ నగర్ లో.... కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు

### శాలివాహన సంఘం ఆధ్వర్యంలో.



**జవహర్ నగర్, మార్చి13:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ లో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను శుక్రవారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొల్ల జయంతి సందర్భంగా ఆమె అందించిన సాహితి సేవలను పలువురు వక్తలు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాలివాహన సంఘ సభ్యులు కట్కూరి రామకృష్ణ హాజరై మాట్లాడుతూ రామాయణాన్ని సంస్కృతంలో నుంచి తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్ల మాంబ యే అని పేర్కొన్నారు. మల్ల 586వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం ముదాబావమన్నారు. వేడుకల సందర్భంగా స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, పోరండ్ల యాదగిరి, సాయిబాబా ,విశ్వనాథ్, సత్యనారాయణ, రమేష్, నర్సింగ్, కన్నయ్య, సాంబయ్య, కిష్టయ్య, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్పొరేటర్ “రాగం”



**శేరిలింగంపల్లి,మార్చి 13 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని హుడా ట్రేడ్ సెంటర్‌లో ఉన్న శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీరామ తారక పంచాయతన దేవతా యజ్ఞ అష్టోత్తర మహా కలశ మహా కుంభాభిషేక కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి.బ్రహ్మశ్రీ కన్నేపల్లి శివరామచంద్రమూర్తి గురువుగారి స్వయం పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహేష్, రవి యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఆహారంతోనే కీళ్లు, ఎముకలు పటిష్టం

- ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి
- ప్రజల ఆరోగ్యంపై లీ ఫార్మా, లీ డోమైన్ హెల్త్ ప్రత్యేక దృష్టి
- లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి







**విశాఖపట్నం,మార్చి 13 (వార్తాప్రభ) :** ప్రజలు అగోగ్యకరమైన జీవనం సాగించాలంటే పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని, ఎముకలు గట్టి పడేందుకు నాణ్యమైన పదార్థాలు తీసుకోవాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి అన్నారు. ప్రజలకు మేలు చేయడమే ధ్యేయంగా లీ ఫార్మా, లీ హెల్త్ డొమైన్ సంయుక్తంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ షాపింగ్ మాల్‌తో కలిసి శుక్రవారం మాల్ ఉద్యోగుల కోసం ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ వైద్య శిబిరం ద్వారా 100 మంది లబ్ధి పొందారు వీరికి హ్యాండ్ గ్రిప్, బిఎంఐ, హెచ్.బి, ఆర్.బి.ఎస్, బిపి, ఎముక ఖనిజ సాంద్రత, బాడీ కంపోజిషన్ వంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం డాక్టర్ మరియు న్యూట్రిషనిస్ట్ నివేదికలను పరిశీలించి, ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి మాట్లాడుతూ కీళ్లు, ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు వ్యాయామం, తగినంత నిద్ర, పోషకాలతో కూడిన ఆహారం తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. కీళ్లు, ఎముకలు ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లుగా సరోజిని, జయలక్ష్మి, డాక్టర్ రావుబాబు, న్యూట్రిషనిస్టులు మాధురి, క్రాంతి, జీఎన్ఎం భాగ్యలత, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ రీజనల్ మేనేజర్ నవీన్, లీ ఫార్మా ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పాలనకు ప్రతిబింబంగా 'ప్రజాదర్బారు'

## -112 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య..

**పెనుగంచిప్రోలు,మార్చి 13 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక అయిన "ప్రజాదర్బారు" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 112 మందివారి సమస్యలు పై ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలు సమర్పించిన అర్జీలలో ఇళ్ల నిర్మాణం, ఇళ్ల స్థలాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, రైస్ కార్డులు, ఉపాధి అవకాశాలు, పెన్షన్లు, దివ్యాంగుల సర్టిఫికెట్లు, వివిధ రెవెన్యూ సేవలు వంటి అంశాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీ ఆర్ ఎస్ ) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి బాధ్యతాయుతంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, అధికారులు మరియు సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిలబెడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మరియు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాదర్బారు వేదికలో అన్ని శాఖల అధికారులు మరియు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ జీ. శ్రీను , డిప్యూటీ . ఎంపీడీఓ సుభారావు , సీవపు యంగ్ ప్రొఫెషనల్ మరియు వారి బృందం, యం ఎ ఓ , ఆర్ ఐ సొసైటీ చైర్మన్ దూలిపాళ్ల లక్ష్మణరావు , టీడీపీ మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య ,తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంట్ అధికార ప్రతినిధి నల మోలు వెంకట రామ ప్రసాద్,మాజీ జెడ్ పిటిసి గజ్జి కృష్ణ మూర్తి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు,గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్ కుమార్ ,అలాగే ఇతర మండల మరియు గ్రామస్థాయి అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో రైతులకు రూ.57.591 కోట్లు లబ్ధి

## -ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.





**అవనిగడ్డ,మార్చి 13 (వార్తాప్రభ) :** అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ కింద కూటమి ప్రభుత్వం ద్వారా నియోజకవర్గంలో రైతులకు రూ.57.591 కోట్లు లబ్ధి చేకూరినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అవనిగడ్డ రెవిన్యూ హాలులో అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ మూడవ విడత సభ జరిగింది. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ రైతులతో కలిసి నియోజకవర్గంలో 30,316 మంది రైతులకు రూ.17.05కోట్లు లబ్ధి చెక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో 30,316మంది రైతులకు ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ద్వారా రూ.42.45కోట్లు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.15.1412 కోట్లు కలిపి రూ.57.591కోట్లు లబ్ధి చేకూరినట్లు వివరించారు. ధాన్యం సొమ్ము 24గంటల్లోపు ఇచ్చిన ఘనత తమ కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. నియోజకవర్గంలో ఈ ఏడాది 21,990మంది రైతుల వద్ద నుంచి 1,01,157 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.240.95 కోట్లు సొమ్ము సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వం జల వనరుల శాఖలో కనీసం మైంటెనెన్సు కూడా చేయకపోవడంతో లాకుల గేట్లన్నీ చిల్లులు పడ్డాయన్నారు. దివిసీమ జీవనాడి పులిగడ్డ ఆక్విడెక్టును వైసీపీ పాలకులు విస్మరించారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో దాదాపు అన్ని లాకులకు నూతన గేట్లు ఏర్పాటు చేశామని, ఆక్విడెక్టు సమగ్ర అభివృద్ధి చేశామన్నారు. రైతులకు అన్ని రకాలుగా కూటమి ప్రభుత్వం మేలు చేస్తోందన్నారు. ఔట్ ఫాల్ స్లూయిజుల పునర్నిర్మాణానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులు, నాయకులతో కలిసి ప్రధాని నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబు సభల లైవ్ తిలకించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, ఎంపీపీ తుంగల సుమతి, ఏడీఏ జేఎస్ జయప్రద, తహసీల్దార్లు ముప్పిరిశెట్టి హరనాథ్, సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, విజయప్రసాద్, శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, సౌజన్య కిరణ్మయి, ఎంపీడీఓ మరియాదేవి, సర్పంచులు పైడిపాముల కృష్ణకుమారి, డొక్కు నాగేశ్వరరావు, ఎంపీటీసీ బొప్పన భాను, టీడీపీ మోపిదేవి మండల అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు నాగిశెట్టి అయ్యప్ప, బీజేపీ ఉపాధి పథకం విభాగం జిల్లా అధ్యక్షులు జీవీ నగరాయలు, పీఏసీఎస్ చైర్మన్లు మాదివాడ రత్నారావు, యలవర్తి చిన్నా, కోసూరు నాగమల్లేశ్వరరావు, బీ.సీతారాం ప్రసాద్, ఏఓలు కే.మురళీ కృష్ణ, టీ.శుభ హారిక, డీ.అనూష, హెప్సిబా రాణి, సంజీవ్ కుమార్, శ్రీధర్, ఉద్యాన శాఖ అధికారి నల్లగట్ల రమేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భోగాది చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వేములపల్లి శ్రీహరి, నీటి సంఘాల అధ్యక్షులు, ఏఎంసీ డైరెక్టర్లు, సొసైటీ పర్సన్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అసంబద్ధంగా పెరిగిన ఇంటి పన్నుల పై న్యాయపోరాటం



**హనుమాన్ జంక్షన్,మార్చి 13 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతమైన బాపులపాడు గ్రామ పంచాయతీలో 2014–2015 లో అప్పటి పాలకవర్గం పెంచిన ఇంటి పన్నులను బేషరతుగా తక్షణమే స్పందించి తగ్గించాలని సామాజికవేత్త వేగుంట రామారావు హైకోర్టు అడ్వకేట్ గోగినేని విజయబాబు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం హనుమాన్ జంక్షన్ భాస్కర్ అపార్ట్మెంట్స్ వద్ద జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో పన్నులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి 100 శాతం నుండి 1000 శాతం వరకు పెద్దపెద్ద నగరాల్లో లేనివిధంగా పెంచేశారని అన్నారు. గత 10 సంవత్సరాలుగా పన్నులు కట్టటం బాపులపాడు గ్రామ పంచాయతీలోని ప్రజలకు పెనుబారంగా మారిందన్నారు. గత 10 సంవత్సరాలు గా అధికారులకు వినతి పత్రాలు అందించినా ఉద్యమాలు చేసినా అధికారులు వచ్చి చేతులు దులుపుకొని పోతున్నారని అంతకుమించి ప్రజలకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. ప్రజలకోసం పోరాడుతున్న మేమే బాధితులుగా మారామని అన్నారు. లీగల్ గా వెళితేతప్పా ఈ సమస్యకు పరిష్కారం కాదనే నిర్ణయానికి వచ్చామని అన్నారు. అందుకే హైకోర్టుకు వెళ్లేందుకు నిర్ణయం తీసుకొని జిల్లా కలెక్టర్ కు, జిల్లా పంచాయతీ అధికారి కి, పంచాయతీ కార్యదర్శి కి సైతం నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఇంటి పన్నులు కట్టుకుంటే నీటి కులాయిలకు దమ్మీలు వేస్తామని బెదిరించడం మానుకోవాలని హెచ్చరించారు. మీకాహక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గ్రామంలోని బాధిత ప్రజలకు సూచనలు సలహాలు అందిస్తామని పెంచిన పన్నులు కట్టవద్దని ఆందోళన చెందవద్దని వెగుంట రాము,అడ్వకెట్ విజయబాబు అన్నారు.

# ఎస్ వి వైద్య కళాశాలలో కవయిత్రి మొల్ల జన్మదిన వేడుకలు

**తిరుపతి,మార్చి 13 (వార్తాప్రభ) :** కవయిత్రి మొల్ల జన్మదిన వేడుకలు ఎస్వీ వైద్య కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఎస్ఎన్.మూర్తిఎస్ వి వైద్య కళాశాలలో శుక్రవారం చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్ల. ఆమె సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులోకి అనువదించారు. మొల్ల రామాయణం అనే ఈ కావ్యం, తెలుగు సాహిత్యంలో ఒక మహాకావ్యంగా ప్రసిద్ధి చెందింది. మొల్ల రామాయణం, మొల్ల రచించిన ప్రసిద్ధ కావ్యం. ఇది సంస్కృత రామాయణానికి తెలుగు అనువాదం. ఈ కావ్యం సరళమైన తెలుగు భాషలో రాయబడింది. మొల్ల రామాయణం, తెలుగు సాహిత్యంలో ఒక మహాకావ్యంగా ప్రసిద్ధి చెందింది ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తెలుగు సాహిత్యానికి చేసిన సేవ అమూల్యమైనది. ఆమె రచనలు, మొల్ల, తెలుగు సాహిత్యంలో ఒక మహిళా కవయిత్రిగా ప్రసిద్ధి చెందారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి .ఎస్.ఎన్ మూర్తి, ఎస్



వి వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఉమాదేవి, ఆఫీస్ సూపరిటెండెంట్ రేణుక, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సెక్రటరీ ఏటుకూరి గిరిబాబు, ముని కేశవులు, బాలరాజు నాయుడు, మురళి, ఎస్ వి వైద్య కళాశాల వైద్యులు, వైద్య సిబ్బంది, తదుతరులు పాల్గొన్నారు.


# అన్నదాత సుఖీభవ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పెనుగంచిప్రోలు,మార్చి 13 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకం 2025--26 మూడవ విడత నిధుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 24,514 మంది రైతులకు మూడు విడతలుగా మొత్తం రూ.48.18 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో రూ.17.04 కోట్లు.రెండవ విడతలో రూ.16.80 కోట్లు,మూడవ విడతలో రూ.14.34 కోట్లు.మొత్తం ఈ మూడు విడతల ద్వారా రైతులకు భారీ స్థాయిలో ఆర్థిక సహాయం అందిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు సంతోషంగా ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు. రైతన్నల కష్టానికి గౌరవం ఇచ్చే ప్రభుత్వమే నిజమైన ప్రజా ప్రభుత్వం అని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారు ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం రైతులకు నేరుగా ఆర్థిక భరోసా కల్పిస్తున్న మహత్తర పథకం అని, రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ కావడం వల్ల మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతులకు మేలు జరుగుతోందని అన్నారు. అలాగే రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రైతు సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు అవుతున్నాయని, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా రైతులకు మరింత ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. రైతులకు సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్ సదుపాయాలు అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని చెప్పారు. రైతులు పండించిన పంటలకు సరైన ధర రావడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని, రైతుల అభ్యున్నతి కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామానికి చెందిన మహిళా రైతు తుమ్మల నాగమల్లేశ్వరితో ఎమ్మెల్యే ముఖాముఖి చర్చించారు. నాగమల్లేశ్వరి తన 7 ఎకరాల పొలంలో మిరప, పత్తి, మొక్కజొన్న మరియు ఉద్యానవన పంటలను ప్రకృతి సాగు పద్ధతిలో పండిస్తూ, రసాయన ఎరువులతో చేసే వ్యవసాయంతో పోలిస్తే భారీగా పెట్టుబడిని ఆదా చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. రసాయన వ్యవసాయం చేస్తే సుమారు రూ.4 లక్షలు ఖర్చయ్యే చోట, ప్రకృతి వ్యవసాయం ద్వారా కేవలం రూ.1.45 లక్షలతోనే సాగు చేసి సుమారు రూ.2.55 లక్షల పెట్టుబడిని ఆదా చేయడం అభినందనీయం అని కొనియాడారు. అలాగే ఆమె స్వయంగా సేంద్రియ ఎరువులను తయారు చేసి ఇతర రైతులకు విక్రయిస్తున్నారని తెలుసుకుని ఎమ్మెల్యే గారు ప్రత్యేకంగా అభినందించారు. అయితే మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నానని ఆమె చెప్పగా, దీనిపై ఎమ్మెల్యే గారు అక్కడికక్కడే కీలక హామీ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మార్కెటింగ్ సమస్య ఉండకూడదు. జగ్గయ్యపేట మార్కెట్ యార్డులో ఎటువంటి రుసుము లేకుండా ఆమె తయారు చేసిన సేంద్రియ ఎరువులను విక్రయించడానికి ప్రత్యేకంగా ఒక షాపు ఏర్పాటు చేస్తాం. ఇలాంటి రైతులను ప్రోత్సహిస్తే మరికొందరు రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లుతారు అని ఎమ్మెల్యే తాతయ్య గారు తెలిపారు. రసాయన వ్యవసాయం కారణంగా రైతులకు అధిక పెట్టుబడి భారం పెరుగుతోందని, అలాగే ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విషరహిత ఆహారం సమాజానికి ఎంతో అవసరమని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ప్రజలు వినియోగించాలని కోరారు. అలాగే పోలంపల్లి మున్నేరు డ్యాం పునర్నిర్మాణం కోసం రూ.21.50 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. డ్యాం పనులు పూర్తయితే రైతులకు సంవత్సరానికి రెండు పంటలు పండించే అవకాశం కలుగుతుందని అన్నారు. అదేవిధంగా వేదాద్రి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని, త్వరలోనే పూర్తి చేసి రైతులకు సాగునీరు కొరత లేకుండా చేస్తామని పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ, కొండయ్య మరియు పిఏసిఎస్ చైర్మన్లు కర్ల వెంకటనారాయణ, ఉమ్మినేని పుల్లారావు, పొందూరు నాగేశ్వరరావు, అత్తులూరు అచ్యుత్ రావు, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు,పోలంపల్లి ప్రాజెక్టు చైర్మన్ పొన్నం బాలాజీ, నీటి సంఘం నాయకులు కర్ల నాగేశ్వరరావు, నూతలపాటి కృష్ణ, యనమదల నరేష్, వేగినేటి గోపాలకృష్ణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తుడం శైలజ మరియు వ్యవసాయ శాఖ అధికారులు మరియు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే ప్రజాదర్బార్...

## -కిర్లంపూడిలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ...





**కాకినాడ జిల్లా కిర్లంపూడి,మార్చి 13 (వార్తాప్రభ) :** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. కిర్లంపూడి మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు స్వీకరించారు. పలు సమస్యలపై వినతులు అందగా అందులో పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజల నుంచి అందిన ప్రతీ వినతి పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా దర్బర్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# దోసపాడు కాలువ ఛానల్ పనులు ప్రారంభించడం అభినందనీయం

## – కళింగ సాధికార కమిటి అధ్యక్షుడు సింగవరపు



**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** నందివాడ మండల ప్రజల కోసం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేస్తున్న అభివృద్ధికి కళింగ సాధికార కమిటి అధ్యక్షుడు సింగవరపు ప్రభాకార్ ప్రతేక ధాన్యవాదలు తెలిపారు. శుక్రవారం నందివాడ మండలంలోని లక్ష్మీనరసింహాపురంలో దోసపాడు ఛానల్ కాలువని డిసిఎస్ బాబు, ఉపాధ్యక్షులు రాకేష్, లక్ష్మీ నరసింహపురం గ్రామం పార్టీ అధ్యక్షులు వెంకటరంగారావు, మచిలీపట్నం వాణిజ్య విభాగ కార్యదర్శి సింగవరపు బాబురావులతో కలసి కృష్ణాజిల్లా కళింగ సాధికార కమిటీ అధ్యక్షులు సింగవరపు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా దోస్పాడు ఛానల్ కాలు ఎవరూ పట్టించుకోలేదని, మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని మాటలు తప్పితే గత 20 సంవత్సరాల్లో ఏ పనులు చేయలేదని విమర్శించారు. లక్ష్మీనరసింహపురం మా గ్రామానికి వాటర్ రావాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, శాసనసభ్యులు వెనిగండ్ల రాము, సంబంధించిన అధికారులతో మాట్లాడం అభినందనీయమాన్నారు.

# తడి చెత్త వేరు చేయడంపై హోం కంపోస్టింగ్‌పై శిక్షణ



**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** తడి పోడి చెత్తను వేరు చేసి విధనంపై మున్సిపల్ కమిషనర్ మనోహర్ ప్రతేక శిక్షణ తరగతులు నిర్వహించి హోం కంపోస్టింగ్ కిట్లను పంపిణి చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ డ్వాక్రా ఆర్‌పిలకు తడి,పోడి చెత్త వేరే చేసే విధనంపై ప్రతేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇంటి వద్దనే తడి చెత్తను వేరు చేయడం, సహజ ఎరువు తయారుపై ప్రతేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

# విధుల పట్ల మక్కువ.. శ్రమలో నిబద్ధత: అందరి మన్ననలు పొందుతున్న నైట్ వాచ్‌మెన్ 'కోటి'



**నూజివీడు,మార్చి 13 (వార్తాప్రభ) :** నేటి సమాజంలో కేవలం తమకు కేటాయించిన పనిని మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకొనే వారున్న ఈ రోజుల్లో, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్ గా విధులు నిర్వహిస్తున్న చలమాల కోటేశ్వరరావు (కోటి) అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాత్రి వేళల్లో కార్యాలయానికి కాపలాగా ఉండటమే తన బాధ్యత అయినప్పటికీ, ప్రస్తుతం కార్యాలయంలో జరుగుతున్న ఆధునీకరణ పనుల్లో ఆయన స్వచ్ఛందంగా పాలుపంచుకోవడం విశేషం. కార్యాలయ నూతన నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న గోడలకు, ఇతర కాంక్రీట్ పనులకు స్వయంగా తనే వాటరింగ్ చేస్తూ నిర్మాణాల పటుత్వానికి తన వంతు సహకారం అందిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కార్యాలయం బాగుండాలనే తపనతో ఆయన చేస్తున్న ఈ శ్రమను తోటి సిబ్బంది మరియు అధికారులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

**ప్రజల ప్రశంసలు:** మంచి పని ఎవరు చేసినా స్వాగతించాలని, శ్రామికుడి శ్రమను గుర్తించి గౌరవించాలని నూజివీడు పట్టణ ప్రజలు హర్షిస్తున్నారు. తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూనే, అదనపు బాధ్యతగా కార్యాలయ అభివృద్ధిలో భాగస్వామి అవుతున్న కోటి అంకితభావం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## గ్రామ పంచాయితీ కార్యాలయము, గురివిందగుంట
### పెడన మండలము
### టెండరు ప్రకటన

కృష్ణాజిల్లా, పెడన మండలము, గురివిందగుంట గ్రామ పంచాయితీ ఈ క్రింది పనులు కాంట్రాక్టు లేబర్ పద్ధతిపై ది.01-04-2026 నుండి 31-03-2027 వరకు చేయుటకు ఆశక్తి గల అభ్యర్థుల నుండి ది:24-03-2026 వ తేదీ ఉ.11:00గం॥ల వరకు గ్రామ పంచాయితీ కార్యాలయములో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడును, స్వీకరించబడిన టెండర్లు అదే రోజు మ.12:30 గం॥లకు హాజరైన టెండరు దార్ల సమక్షములో తెరువబడును, టెండరు దాఖలు చేయువారు ముందుగా నిర్ణీత ధరావత్తు లేదా తగిన విలువతో హామీ పత్రము చెల్లించవలెను ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడువు.

| వ.నెం | పని వివరము | టెండరు హెద్యుల కాలము | చెల్లించవలసిన ధరావత్తు |
|---|---|---|---|
| 1) | వీధి లైట్లు ఏర్పాటు చేయుటకు ఎలక్ట్రీషియన్ - 1 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |
| 2) | పారిశుధ్య పనులు-1 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |
| 3) | PWS ట్యాంక్ ఆపరేటర్గా పనిచేయుటకు-1 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |

నోట్ :-
1. పంచాయితీ నియమ నిబంధనలకు లోబడి పనిచేయవలెను.
2. పంచాయితీ నిధుల నిల్వను బట్టి పేమెంట్ చేయబడును.

సం/- శ్రీమతి పుప్పాల స్వరూపా రాణి, సర్పంచ్, గురివిందగుంట గ్రామ పంచాయితీ
సం/- శ్రీ చాపరాల రాజేష్, కార్యదర్శి, గురివిందగుంట గ్రామ పంచాయితీ

## గ్రామ పంచాయితీ కార్యాలయం,రామానుజ వర్తర్లపల్లి
### టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.నిల్/2026 — తేది. 13.03.2026.

కృష్ణాజిల్లా, గూడూరు మండలం, రామానుజ వర్తర్లపల్లి గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2026-27 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2026 నుండి 31.03.2027 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును.సదరు టెండర్లు ది.24.03.2026 వ తేది మధ్యాహ్నం 2.00 గం,లకు వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 2.30 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ట్యాంక్ ఆపరేటర్గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |
| 2) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |
| 3) | స్వీపర్గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

సం/- శ్రీమతి రాజులపాటి రేణుకమ్మ, సర్పంచ్, రామానుజ వర్తర్లపల్లి గ్రామ పంచాయితీ
సం/- శ్రీ గంజాల నవీన్ కుమార్, కార్యదర్శి, రామానుజ వర్తర్లపల్లి గ్రామ పంచాయితీ

## గ్రామ పంచాయితీ కార్యాలయం, చంద్రాల
### టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.3/2026 — తేది. 13.03.2026

కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, చంద్రాల గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2026-27 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2026 నుండి 31.03.2027 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును.సదరు టెండర్లు ది.23.03.2026 వ తేది మధ్యాహ్నం 1.00 గం,లకు వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 1.30 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ట్యాంక్ ఆపరేటర్గా పనిచేయుటకు ఇద్దరు వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |
| 2) | స్వీపర్గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |
| 3) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

సం/- శ్రీ కాలిశెట్టి అర్జునరావు, సర్పంచ్, చంద్రాల గ్రామ పంచాయితీ
సం/- శ్రీ బచ్చలకూరి రాజేంద్రబాబు, కార్యదర్శి, చంద్రాల గ్రామ పంచాయితీ

## గ్రామ పంచాయితీ కార్యాలయం, రామరాజుపాలెం
### టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.3/2026 — తేది. 13.03.2026

కృష్ణాజిల్లా, గూడూరు మండలం, రామరాజుపాలెం గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2026-27 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2026 నుండి 31.03.2027 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును.సదరు టెండర్లు ది.24.03.2026 వ తేది మధ్యాహ్నం 1.00 గం,లకు వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 1.30 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | స్వీపర్గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |
| 2) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

సం/- శ్రీ పరసా రాజులు, సర్పంచ్, రామరాజుపాలెం గ్రామ పంచాయితీ
సం/- శ్రీమతి జన్యావుల సుష్మా, కార్యదర్శి, రామరాజుపాలెం గ్రామ పంచాయితీ

## గ్రామ పంచాయితీ కార్యాలయం, ఆకుమర్రు
### టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.3/2026 — తేది. 13.03.2026

కృష్ణాజిల్లా, గూడూరు మండలం, ఆకుమర్రు గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2026-27 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2026 నుండి 31.03.2027 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును.సదరు టెండర్లు ది.26.03.2026 వ తేది మధ్యాహ్నం 1.00 గం,లకు వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 1.30 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | స్వీపర్గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |
| 2) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

సం/- శ్రీమతి బొల్లా కృష్ణకుమారి, సర్పంచ్, ఆకుమర్రు గ్రామ పంచాయితీ
సం/- శ్రీమతి జన్యావుల సుష్మా, కార్యదర్శి, ఆకుమర్రు గ్రామ పంచాయితీ

## దస్తావేజులు పోయినవి

ఎన్టిఆర్ జిల్లా, విజయవాడ వన్టౌన్, వెనిగళ్ళ వెంకటసుబ్బయ్య వీధి, హాస్టల్ రోడ్డు, డోరు నెం.5-6-59/2/3రు కాపురస్తుడు దుడ్డు కోటేశ్వరరావు గారి కుమారుడు దుడ్డు మల్లేశ్వరరావు అను నేను 1) తమిళనాడు రాష్ట్రం, అంబత్తూరు సబ్రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిష్ట్రీ కాబడిన స్పెషల్ పవరాఫ్ అటార్నీ దస్తావేజు నెం.31/2022 మరియు నా పేరిట తమిళనాడు రాష్ట్రం, అలందూర్ సబ్రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిష్ట్రీ కాబడిన సెటిల్మెంటు దస్తావేజు నెం.6779/2022గా గల ఒరిజినల్ దస్తావేజులతోపాటు మరికొన్ని కాగితములు కలిగిన కవర్ను బండికి తగిలించుకొని మా ఇంటి వద్ద నుండి గాంధీనగర్లో జిరాక్సు తీయించుకునేందుకు వెళ్లు సందర్భంలో ది.12-03-2026వ తేదీన జారిపడిపోయినవి. వెంటనే చుట్టుప్రక్కల ఎక్కడ వెదకిననూ ఒరిజినల్ దస్తావేజులు కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజులు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగ పరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజును ఎవరికినీ తాకట్టు పెట్టుటగానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగియుండలేదని యిందుమూలముగా తెలియ జేయుచున్నాను.

సెల్ నెం.9944921694

## అన్నదాత సుఖీభవ.... రైతు ఖాతాలకు నగదు బదిలీ



**పెడన,మార్చి 13 (వార్తాప్రభ) :** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డ్ నందు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతు ఖాతాలకు నగదు బదిలీ కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ అనేది చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలకు ఏడాదికి ?15 వేలు పెట్టుబడి మద్దతు అందించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మొదలుపెట్టిన సంక్షేమ కార్యక్రమం అని అన్నారు కేంద్ర ప్రభుత్వం వారి ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి లో భాగంగా ఇచ్చే ?6000 కు రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపి దాదాపు 70 లక్షల రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేరుతుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు పెడన నియోజకవర్గ పరిధిలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు చివరి భూమి వరకు నీరు అందించే లక్ష్యం గా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే కాగిత అన్నారు అన్నదాత సుఖీభవ పథకం కింద నియోజకవర్గంలో 24,202 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ 4 వేలు చొప్పున 9.68 కోట్లు కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.3.87 కోట్లు మొత్తంగా రూ.13.55 కోట్లు రైతు ఖాతాలకు జమ కానున్నాయని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అర్జా నగేష్ఛలపాటి ప్రసాద్ యక్కల శ్యామలయ్య గోపి నాగబాబు ఒడుగు తులసిరావు వూసా వెంకయ్య కూటమి నాయకులు అధికారులు రైతులు పాల్గొన్నారు

## సొసైటీ సభ్యులందరూ వన్ టైం సెటిల్మెంట్ ను సద్వినియోగం చేసుకోండి...
### -పి ఎ సి ఎస్ అధ్యక్షుడు నాగబాబు...



**కృత్తివెన్ను,మార్చి 13 (వార్తాప్రభ) :** కోమాళ్ళపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సభ్యులుగా ఉండి రుణాలు తీసుకున్న రైతులు కొంతమంది వ్యవసాయ నిమిత్తం తీసుకున్న అప్పు చెల్లించే విషయంలో ఆలస్యం అవుతున్న కారణంగా కొంతమంది రైతుల విజ్ఞప్తి మేరకు, చొరవ తీసుకున్న చైర్మన్ నాగబాబు బ్యాంక్ సీఈఓ తో రైతులు పడుతున్న ఇబ్బందులు గురించి వివరించి, వారిని ఆదుకోవాల్సిందిగా కోరిన మీదట నామమాత్రపు వడ్డీతో అసలు చెల్లించే విధంగా వన్ టైం సెటిల్మెంట్ తీసుకురావడం జరిగిందని చైర్మన్ కూనసాని నాగబాబు తెలియజేశారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవలసిందిగా ఆయన తెలియజేశారు. ఈ నెల 31 వ తారీకు ఆఖరి తేదీగా తెలియజేశారు. సొసైటీలో అప్పు తీసుకుని చెల్లించకుండా చనిపోయిన వ్యక్తి తాలూకా పూర్తిగా వడ్డీని మాఫీ చేస్తారని బ్యాంక్ అధికారులు నాగబాబుకు హామీ ఇచ్చారని ఆయన తెలియజేశారు. అలాగే 13వ తేదీ శుక్రవారం నాడు ఐదు గంటలకు ప్రధానమంత్రి మోడీ పీఎం కిసాన్ పథకం 22వ విడత విడుదల సందర్భంగా కొమ్మళ్ళపూడి పిఎసిఎస్ చైర్మన్ కూనసాని నాగబాబు, మరియు డైరెక్టర్లు ఇల్లూరి వెంకట సుబ్బారావు ఆరేపల్లి మార్కండేయులు ద్వారా పిఎసిఎస్ నందు లైవ్ వీడియోను తిలకించారు. ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను మండల బిజెపి అధ్యక్షుడు యేసు రాజు, కానుమల్లి దామోదర్ రావు, కూనసాని హరిబాబు, పర్వతనేని భాస్కరరావు, తోట ముసలయ్య, చిలుకూరి దుర్గాప్రసాద్, చిలుకూరి రాజారావు, నెక్కంటి రామారావు, కాకర బాలశౌరి జల్లా ఏడుకొండలు, జె. శర్మ కే.ఏసు రాజు మూర్తి పాల్గొన్నారు....

## ఏపీకి భారీగా కేంద్ర నిధులు


**న్యూఢిల్లీ, మార్చి 13 (వార్తాప్రభ) :** కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్కు భారీ ఊరటనిస్తూ విపత్తు సహాయక నిధులను విడుదల చేసింది. గతేడాది అక్టోబర్లో సంభవించిన మొంథా తుపాను, దానివల్ల ఏర్పడిన ఆకస్మిక వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం అదనపు ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఈరోజు జరిగిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## క్షేత్రస్థాయిలో పర్యటించిన శాసనసభ్యులు కృష్ణ ప్రసాద్
### పంటల గురించి ఆరా..



**పెడన,మార్చి 13 (వార్తాప్రభ) :** శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా రైతుల ఖాతాలో డబ్బులు పడిన విషయాన్ని స్వయంగా రైతుల దగ్గరకు వెళ్లి రైతులు వేసిన పంటల గురించి తెలుసుకొని వేసిన పంటలు గురించి అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం నాయకుల తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన స్థానిక రైతులతో కలిసి నాయకులు పంట పొలాలను దర్శించి క్షేత్రస్థాయిలో సాగు పరిస్థితులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో జడ్పిటీసి అర్జ నగేష్ పెడన టిడిపి మండల నాయకుడు చలపాటి వీరప్రసాద్ శ్రీరాం ప్రసాద్ యక్కల శ్యామలయ్య గోపి నాగబాబు, చెన్నకేశవలు మల్లీశ్వరశీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఓడుగు తులసి రావు బంటుమిల్లి డిసి చైర్మన్ బొర్రా కాశీ కృత్తివెన్ను డిసి చైర్మన్ నెక్కంటి భాస్కరరావు జనసేన నాయకులు ఊసా వెంకయ్య అగ్రికల్చర్ ఏడి గారు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలమ్మ తల్లి పూజా కార్యక్రమంలో పాల్గొన్న వై సి పి నేత తన్నీరు



**పెనుగంచిప్రోలు,మార్చి 13 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని సుబ్బాయిగూడెం గ్రామ సర్పంచ్ పాపినేని వెంకటేశ్వర రావు, సోదరుడు పాపినేని శ్రీను పోలం నందు ఏర్పాటు చేసిన ఉప్పలమ్మ తల్లి పూజా కార్యక్రమంలో పాల్గొన్న జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి - నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, మండల బీసీ సెల్ విభాగ అధ్యక్షులు గుడికందుల సత్యనారాయణ, పట్టణ 26,30 వార్డుల అధ్యక్షులు రుంజ నాగేశ్వరరావు, దార్ల ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు....

## నేడు విద్యుత్ అంతరాయం

**కృత్తివెన్ను,మార్చి 13 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండల పరిధిలోని కృత్తివెన్ను లక్ష్మీపురం సబ్ స్టేషన్ లకు సరఫరా అయ్యే 33 కె.వి, కృత్తివెన్ను ఫీడర్ మెయింటినెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ కు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు తెలియజేశారు. దీనివలన కృత్తివెన్ను మరియు లక్ష్మీపురం సబ్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు మరియు ఆక్వా రైతులకు అంతరాయం కలుగుతుంది కావున ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకుని విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు....

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైయస్సార్ సిపి నాయకులు




**గన్నవరం,మార్చి 13 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గం లివిజయవాడ రూరల్ నిడమానూరు గ్రామంలో : పరిమి రమేష్ కుటుంబ సభ్యులు పరిమి వంశీ సింధూర గార్లు ఈరోజు రంజాన్ పండుగ (ఉపవాస దినములు) సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు కార్యక్రమంలో పరిమి రమేష్ కుమారుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిమి వంశీ , పరిమి సింధూర, గ్రామ సర్పంచి శీలం రంగారావు , పరిమి విష్ణు,రాష్ట్ర కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వరరావు , జడ్పిటిసి సభ్యులు కాకర్లమూడి సువర్ణ రాజు , సొసైటీ బ్యాంక్ మాజీ చైర్మన్ బొప్పన కృష్ణ , షేక్ రఫీ,నున్న నాయకులు శివరామిరెడ్డి, హనుమ , జీతం శ్రీనివాస్ , దండు సుబ్రహ్మణ్యం గారు, కలపాల అబ్రహం , షేక్ మీరవాలి , తుపాకుల అప్పారావు ,మరియు ముస్లిం సోదరీ సోదరీమణులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు

## రైతు సంక్షేమం కూటమి ప్రభుత్వం తోనే సాధ్యం

- మైలవరం నియోజకవర్గంలో రైతులకు రూ.16.80 కోట్లు జమ
- మూడు విడతల్లో రూ.56.62 కోట్లు అందజేత
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు
- వెల్వడంలో మూడవవిడత 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ





**జి.కొండూరు,మార్చి 13 (వార్తాప్రభ) :** రైతు సంక్షేమం కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని,రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం మరియు వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడం కోసం పలు కార్యక్రమాలు చేపడుతుం దని,ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద మూడో విడత అర్థిక సాయన్ని విడుదల చేసిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్అన్నారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలో 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' పథకాన్ని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మిశ ఐ.ఏ.ఎస్ , మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా పీఎం మోడీ, సీఎం చంద్రబాబు ప్రసంగాలను వర్చువల్ గా తిలకించారు.రైతులతో వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు.వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో అన్నదాతలకు రూ.16.80 కోట్లను 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' పథకం కింద మూడో విడత పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఒక పక్క అభివృద్ధి చేస్తూనే పేదలు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.నేడు పెట్టుబడి సాయం కింద ఒక్కో రైతుకు రూ.6 వేలు మూడవ విడతగా అందజేస్తోందనీ,ఇప్పటికే రెండు విడతలుగా రూ.14వేలు జమచేయగా నేడు ఇస్తున్న రూ.6వేలతో కలిపి, ఒక్కో రైతుకు రూ.20వేలు చెల్లించి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ కింద మైలవరం నియోజకవర్గంలో రూ.12.10 కోట్లు రైతుల ఖాతాలో జమ చేస్తుండగా దాదాపు 30,241 మంది రైతులకు లబ్ది కలుగుతుందనీ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ యోజన కింద మైలవరం నియోజకవర్గంలో రూ.4.70 కోట్లు రైతుల ఖాతాలో జమ, దాదాపు 23,503 మంది రైతులకు లబ్ది చేకూరుతుంద రూ.16.80 కోట్లు మూడవ విడత కింద చెల్లిస్తున్నట్లు వెల్లడించా రు.గత వైసీపీ ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం అదనంగా సాయం అందజేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.మైలవరం నియోజకవర్గంలో మూడు విడతల్లో రూ.56.62 కోట్లను ఈ పథకం కింద అందజేసినట్లు తెలియజేశారు.మైలవరం నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కింద ప్రతి నెలా 42 వేల మందికి రూ.18.16 కోట్ల సొమ్ము పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. కూటమి అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 21 నెలల్లో రూ.381.36 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.తల్లికి వందనం కింద 40 వేల మందికి రూ.60.36 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకం కింద 2,885 మందికి రూ.4.33 కోట్లు మంజూరు చేశామని అన్నారు. ఈ విధంగా ఇప్పటికి మొత్తం రూ.446.05 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసినట్లు ఎమ్మెల్యే వివరిం చారు.డ్రోన్ టెక్నాలజీని కూడా సద్వినియోగం చేసుకోవాలనే సంకల్పంతో 80 శాతం సబ్సిడీపై వ్యవసాయానికి ఉపయోగించే కిసాన్ డ్రోన్స్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.మైలవరం నియోజకవర్గంలో ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ కింద పల్లెల్లో రహదారుల అభివృద్ధికి రూ.32.92 కోట్లు మంజూరు చేశామన్నారు. బీటీ రహదారుల అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేశామన్నారు. కొన్ని చోట్ల రహదారుల నిర్మాణం పూర్తి కాగా కొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. మైలవరం-వెల్వడం రోడ్డును కూడా అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏం సి చైర్మన్ నవ్య శ్రీ, కోమటి సుధాకర్, అక్కల గాంధీ, చెన్నుబోయిన చిట్టిబాబు, ఐ డి సి డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని,జంపాల సీతారామ య్య వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188